




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త





epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

23-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 292 పేజీలు: 10+4 వెల: 8.00






# భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలు

23 నవంబర్, 2025

విశ్వశాంతి, సౌభాగ్యం, సకల జనుల సంతోషం కోసం పరితపించిన

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి సందర్భంగా
నవంబర్ 23, 2025న రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకలు





ప్రధాన వేదిక
ప్రశాంతి నిలయం, పుట్టపర్తి,
శ్రీ సత్యసాయి జిల్లా

భగవాన్ సత్య సాయిబాబా
శత జయంతి సందర్భంగా
భక్తులందరికీ శుభాకాంక్షలు

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సత్య సాయి సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకుందాం... సేవా కార్యక్రమాలకు ప్రేరణ పొందుదాం





శనివారం పుట్టపర్తిలోని సత్యసాయిబాబా మహాసమాధి వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

# శాంతి స్వరూపం సత్యసాయి

>>మంది సత్యసాయి భక్తులు దేశ, విదేశాల్లో ఉన్న పేద వారికి సేవలందిస్తోన్నారు. 1969 నుంచే మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. నేషన్ ఫస్ట్ అనే విధానంలో సత్యసాయి బాబా సేవలందించారు. దీన్ని అందరూ పాటించాలి. బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన స్ఫూర్తితో పని చేస్తామని సంకల్పం తీసుకోవాల్లి అని ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు.

**సత్యసాయి సూత్రాలు పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుంది : సీఎం చంద్రబాబు:** లవ్ ఆల్..సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలి.. ఎవ్వరిని నొప్పించకూడదు అనేది శ్రీ సత్యసాయిబాబా సిద్ధాంతమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనేవి సత్యసాయి బాబా ప్రవచించిన ఐదు సూత్రాలని పేర్కొన్నారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచమంతా శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రజలకు తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారు. సత్యసాయి బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చారు. ఇప్పటికే అదే స్ఫూర్తిని సత్యసాయి భక్తులు కొనసాగించడం నాకు సంతోషాన్నిస్తోంది. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారికి బాబా ట్రస్టు ఆదుకుంటోంది. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్ట్ అమలు చేసి చూపిస్తోంది. శాంతికి బ్రాండ్ అంబాసిడర్లుగా సత్యసాయి బాబా భక్తులు నిలుస్తారు. 7.50 లక్షల వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్ట్ ద్వారా సేవలం దిస్తున్నారు. ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదు. నేడు సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారు. ధనవంతులు... ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను సైతం ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయిబాబా ట్రస్టుకు ఉన్నాయి. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపితం చేసేలా కృషి చేయాలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుంద్ధి అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సిద్ధాంత సూత్రాలే నిజమైన విద్య

## పరిశోధనారంగాన్ని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు

### ఉపరాష్ట్రపతి సిపి. రాధాకృష్ణన్

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 22, ప్రభాతవార్త ప్రతినిధి:** భగవాన్ సత్యసాయి బాబా సిద్ధాంతాలు సూత్రాలే నిజమైన విద్య అని భారత ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని ఉప రాష్ట్రపతి దర్శించుకున్నారు. అనంతరం శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో పట్టభద్రులైన వారికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా బంగారు పతకాలు, పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంస్థను అద్భుతంగా తీర్చిదిద్దారని కితాబు ఇచ్చారు. 2047 నాటికి భారత దేశం నెంబర్1 స్థానంలో ఉంటుందని,



విద్యార్థులకు బంగారు పతకాలు అందిస్తున్న ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్

పట్టభద్రులుగా పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు ఆ అభివృద్ధిలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. పరిశోధనా రంగాన్ని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు కలుగుతాయన్నారు. గత మూడు రోజుల్లో దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న వారు జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారని, దీనిని బట్టి బాబా ఎంతటి శక్తిమంతులనేది అర్థమవుతుందన్నారు. రాజకీయాల్లోకి రావాలని మంత్రి లోకేష్ చెప్పినప్పుడు విద్యార్థుల నుంచి మంచి స్పందన కన్పించిందని, దీని బట్టి విద్యార్థులు భవిష్యత్ లీడర్లుగా మారతారని ఆశిస్తున్నానన్నారు. కలలో కూడా ఊహించనంతటి గొప్ప సమాజాన్ని రూపొందించగలరనే నమ్మకం ఇక్కడున్న విద్యార్థులను చూస్తే కలుగుతోందన్నారు. ఏ యూనివర్శిటీలోనూ కన్పించినంతటి క్రమ శిక్షణ, నిబద్దత శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంస్థలో కన్పిస్తుందన్నారు. కాన్వొకేషన్ లో క్రమశిక్షణ పాటిస్తూ విద్యార్థులు నేల మీద కూర్చొవడం ఎక్కడా చూడలేదనీ, పట్టా పుచ్చుకున్న విద్యార్థులకు, యంగ్ మైండ్స్ తయారు చేసిన ఈ సంస్థకు అభినందనలు తెలిపారు. ఉచితంగా ఇంత పెద్ద ఎత్తున విద్యను అందివ్వడం గొప్ప విషయమన్నారు. ఎంత మందిని గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దామనేది ముఖ్యం కాదు, ఎంత మంది మంచి పౌరులుగా తీర్చిద్దామనే కోణంలో ఈ సంస్థను నడపడం సంతోషాన్నిస్తోందన్నారు. పపంచం చెప్పేది భారత దేశం వింటుందనేది పాత మాట, భారత దేశం చెప్పేది ప్రపంచం వింటోందనేది కొత్త మాట అన్నారు. దేశాన్ని ఈ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రధాని నరేంద్ర మోదీ పాత్ర కీలకమైనది. ఇన్నోవేషన్లకు కేంద్రంగా సుస్థిరాభివృద్ధికి ప్రతిరూపంగా భారత దేశాన్ని ప్రధాని తీర్చిదిద్దారన్నారు. నరేంద్ర మోడి ఓ దేశానికి వెళ్లినప్పుడు ఆ దేశ ప్రెసిడెంట్ మన దేశ ప్రధాని నరేంద్ర మోడి కాళ్లకు నమస్కారం పెట్టారని, 100కు పైగా దేశాలకు కోవిడ్ టీకాలను మన దేశం ఉచితంగా పంపిణీ చేయడమే కారణమని ఆ దేశ ప్రెసిడెంట్ చెప్పారన్నారు. ప్రపంచ ఆర్థిక శక్తిగా నాలుగో స్థానంలో భారత దేశం నిలిచిందని, ఆధునిక విధానాలను పాటించాలని, సంప్రదాయాలను పాటించాలని, మన కోసం మనం బతకడంతో పాటు, ఇతరుల గురించి బతకడమనేది ఉత్తమ విధానం అన్నారు. డ్రగ్స్ ఇప్పుడు అతి పెద్ద సవాలుగా మారిందని, నో టూ డ్రగ్స్ అంటు పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

# పత్తి, మొక్కజొన్న, అరటి రైతులను ఆదుకోండి

>> రాయలసీమలో 40 వేల హెక్టార్లలో అరటి ఉత్పత్తి అవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డిసెంబరు మొదటి వారం నుంచి అరటి ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే అప్పటి వరకూ అరటి రైతులు నష్టపోకుండా తక్షణం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాయలసీమలో పండిన అరటిని రవాణా చేసేందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎప్పటికప్పుడు అరటిని రవాణా చేసేందుకు ఓ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. ఇక పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. మొక్క జొన్న రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలిచ్చారు. మొక్క జొన్న మద్ధతు ధర కంటే తక్కువ రేటు పలుతున్నందున వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఈసారి 1.42 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగైందని 8.18 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 2.04లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీఎం సూచించారు. ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయించేందుకు ప్రయోగాత్మ కంగా కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు. అది సత్ఫలితాలు ఇస్తే మొక్క జొన్న కొనుగోళ్లకు సమస్య ఎదురైనప్పుడు దానిని ఆచరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

**పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ:** పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రతీ రోజూ తనిఖీ చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. రంగుమారిన, తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రాగల రెండు మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాల్సిందిగా సీఎం అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్లాట్ బుకింగ్ సమస్యను పరిష్కరించిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సమీపంలోని జిన్నింగ్ మిల్లులకే పత్తిని రవాణా చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తేమ శాతం లాంటి సీసీఐ నిబంధనల కారణంగా పత్తి రైతులు నష్టపోకుండా చూడాలని సీఎం వారికి సూచించారు.

### శివమొగ్గ జైలు ఖైదీలకోసం

# అరటి గెలల్లో డ్రగ్స్, సిగరెట్ల సరఫరా

**శివమొగ్గ, నవంబరు 22:** కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ కేంద్ర కారాగారంలో అరటిగెలల సాయంతో జైలులో ఖైదీలకు మత్తు ఉత్పత్తులు, సిగరెట్లు అందచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే అనేక మార్లు వార్తలోకెక్కిన ఈ జైల్లో కొందరు ఖైదీలు కావాలనుకుంటే లిక్కర్, సిగరెట్లు, డ్రగ్స్ వంటి నిషేధిత వస్తువులు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలుస్తోంది. శివమొగ్గ జైలులో ఖైదీల విలాసాలకు సంబంధించిన ఆనవాళ్లు ఇటీవల బయటపడిన నేపథ్యంలో భద్రతా సిబ్బంది అప్రమత్తమైంది. నిత్యం తనిఖీలు చేస్తూ.. ఖైదీలపై ఓ కన్నేసి ఉంచింది. ఈ క్రమంలోనే శనివారం రోజు ఉదయం ఒక ఆటో డ్రైవర్ వచ్చి జైలు క్యాంటీన్ కోసమని గేటు బయట ఐదు అరటి గెలలు దించి వెళ్లగా.. భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో ఆ అరటి గెలలను క్షుణ్ణంగా పరిశీలించి చూడగా కాడలు తెరచి, తిరిగి అతికించినట్లుగా కనిపించింది. దీంతో సిబ్బంది వాటిని తెరిచారు. అందులో ఉన్న వాటిని చూసి షాకయ్యారు. ఎందుకంటే అరటి గెలెల్లో జాగ్రత్తగా గమ్ టేప్‌తో చుట్టిన సిగరెట్ల ప్యాకెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలు బయటపడ్డాయి. ఈ వినూత్న స్మగ్లింగ్ పద్ధతి చూసి భద్రతా సిబ్బంది కూడా నివ్వెరపోయారు.

# ఆజాద్ సహా 37 మంది మావోయిస్టులు లొంగుబాటు

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాత వార్త:** మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటిరే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఎపిలలో పదుల సంఖ్యలో నక్సలైట్లు లొంగిపోగా ఇదే క్రమంలో శనివారం నాడు తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఎదుట 37 మంది అజ్ఞాత మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. వీరిలో 25మంది మహిళలు వున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు మరో ముగ్గురు డివిజన్ క మిటీ సభ్యులు తొమ్మిది మంది ఎసిఎంలు ,22 మంది దళ సభ్యులు వున్నారు. వీరు తమ వద్ద వున్న ఒక ఎకె 47 తుపాకి, రెండు ఎస్‌ఎల్‌ఆర్ తుపాకులు, నాలుగు 303 తుపాకులు, ఒక జి2 తుపాకి, 346 తూటాలను ఈ సందర్భంగా అందజేశారు. లొంగిపోయిన వారిలో ము లుగు జి ల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాడ సాంబయ్య అలియాస్ ఆజాద్ (49), పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన అప్పాసి నా రాయణ అలియాస్ రమేష్ (70), ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జి ల్లా జేగరిగుండాకు చెందిన ముచ్చకి సోమడా అలియాస్ ఎర్రా (ఇతను దక్షిణ బస్తర్ డివి జన్ కమి టీ నాయకుడు కూడా)లు కీలకమైన వారు. వీరిపై తలా 20 లక్షల రూపాయల రివార్డు వుంది. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీలో వున్న ఛ త్తీస్‌ఘడ్ దండకారణ్య కమిటీ నక్సల్స్ నూపో గంగా అలియాస్ నీలేష్ (25), మడవి సుక్మా, (25), కట్టం మోటూ (22), ఉయికే బిచ్చే, పూనెం ఉంగి (23), అబ్కా రైమోతి (20), కుడియం దేవే అ లియాస్ రోషిణి (21), బస్తర్ కమిటీ నక్సల్స్ సోడి సుక్కి (20), సోడి పైకి (20), సోడి హిడుమా (17), దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యులు మడవి సోనా (38). హేంలా అడుమే (35). ముచ్చకి ఊరా (22), కుడం లక్ష్మీ (22 ). సోడి సోమిడి (24), పొడియం మసే (26). వద్దం రైను (25) కారం మంగలి (32), మడివి మాంకీ (21), కుంజల కమల (18) పొడియం జోగా (20) , మిద్యం మల్లే (22) వెకో కోసి (22) ఊకె రణిత (22), సోడి మంగి (25), ఉయికే రత్న (20), వెట్టి జోగి (22), ఓయం లాలి (22), మోడియం రోని (21), కోర్సా లక్ష్మీ (21), కులుము ఉంగి (20), హెమ్లా భీమీ (20), మడివి కోసా (27), నుపో మక్కీ (24)లు వున్నారు. లొంగిపోయిన వారిలో 20 లక్షల రూపాయల రివార్డు వున్న ముగ్గురికి చెక్కులను అందించగా మిగతా వారికి తక్షణ సహాయం కింద తలా 25 వేల రూపాయల నగదును అందించారు. లొంగిపోయిన నక్సలైట్లకు నూ. 1.41 కోట్ల నగదును త్వరలో అందజేస్తామని డిజిపి తెలిపారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎపిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన దానికి తమకు ఎలాంటి సంబంధం లేదని డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. హిడ్మా తమ వద్దకు లొంగిపోయేందుకు రాలేదని, ఈ విషయంలో వస్తున్న వార్తలు నిజం కావని ఆయన తెలిపారు.

# డిసెంబరు చివరికి గుంతలులేని రోడ్లు

## పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో రహదారులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో రాబోయే డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో రహదారులన్నింటిని గుంతల రహితంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శనివారం ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టీ కృష్ణబాబు, ఆర్ బీ శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పనుల స్థితిగతులపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్య మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి మరమ్మత్తుల పనుల తీరుపై ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని ఆర్ అండ్ బి శాఖ మంత్రి, ప్రత్యేక ముఖ్య కార్య దర్శిలను సీఎం ఆదేశించారు.. అదే సమయంలో ఇప్పటికీ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అదే సమయంలో రహదారులు మరమ్మతు పనుల నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడవద్దని, అత్యుత్తమంగా ఉండేలా చూడాలన్నారు. రహదారుల అభివృద్ధిలో అత్యున్నత సాంకేతిక విధానాలను, వినూత్న మెటీరియల్ ను ఉపయోగించే విధానాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. గత ఏడాది గుంతల రహిత రహదారులే లక్ష్యంగా మిషన్ పాత్ హోల్ ఫ్రీ లో భాగంగా రూ. 861 నిధులతో రాష్ట్రంలో రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దడం జరిగింది. అయితే గత ప్రభుత్వంలో 5 ఏళ్లలో కనీసం రెన్యువల్ కూడా చేపట్టకపోవడం, రహదారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల రహదారులు మరింత అధ్వాన్నంగా మారాయి. అయినప్పటికీ ఈ ఏడాది రహదారుల నిర్వహణ మరియు ఇంప్రూవ్మెంట్ కోసం రూ. 2500 కోట్లతో పనులు చేపట్టేందుకు ఇప్పటికే పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగింది ఇందులో భాగంగా రూ. 400 కోట్లు నాబార్డ్ నిధులతో 1250 కి.మీ జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం 191 పనులు మంజూరు చేయడం జరిగింది. ఈ పనులన్నీ ఇప్పటికే టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించడం జరిగింది. ఇవి కాకుండా రూ. 600 కోట్లు మూలధన వ్యయం కింద 227 పనులు మంజూరు చేయడం జరిగింది. వీటితో పాటు 1450 కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి చేయడానికి గుత్తేదారులను గుర్తించి పనులు అప్పగించడం జరిగింది. ఇవి కాక మరో 2,104 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి కోసం 274 పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగింది. ఇందుకోసం రూ. 1000 కోట్లతో ఆయా పనులకు టెండర్లు పిలవడం జరిగింది. డిసెంబర్ నెల మొదటి వారంలో ఈ పనులన్నింటినీ గుత్తేదారులు గుర్తించి పనులు మొదలు పెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. ఇవి కాకుండా వివిధ కారణాలతో గుత్తేదారులకు అప్పగించి రద్దయిన రూ. 277కోట్లతో 607 కి.మీ రహదారుల నిర్వహణ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది. రాబోయే 2 - 3 రోజుల్లో ఈ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంతో పాటు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుంది. ఇవి కాకుండా మరో రూ. 233 కోట్ల రూపాయలతో రహదారులు అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇందుకు ఇప్పటికే ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కేవలం ఒక్క ఏడాది వ్యవధిలో రూ. 2500 కోట్లతో 5471 కిలోమీటర్ల రహదారులు అభివృద్ధికి పరిపాలన అనుమతులు ఇచ్చిన ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతోంది.ఇవి కాకుండా 9101 కిలోమీటర్లు అత్యవసర మరమ్మత్తుల కోసం రూ. 500 కోట్లతో ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించడం జరుగుతుంది.. మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న దాదాపు 4794 కిలోమీటర్లు రహదారులను మరమ్మత్తు చేయడం కోసం ఈ నిధులను ఉపయోగించడం జరుగుతుంది. గుత్తేదారుల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఆర్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశాలు ఇప్పటికే పలుమార్లు నిర్వహించడం జరిగింది. ఆర్ బీ శాఖ ఉన్నతాధికారులతో ఇటీవల పుట్టపర్తి, విశాఖపట్నంలోనూ, ఎప్పటికప్పుడూ విజయవాడలోనూ మంత్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సమావేశాలు నిర్వహించడం పనుల పురోగతిని సమీక్షించడం జరుగుతుంది. ఇప్పటికే ప్రారంభించిన పనులన్నీ డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు.

# ఏపి బ్రాండ్‌ను నిలబెడతాం

## 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 22,పభాతవార్త ప్రతినిధి:** కొత్త లేబర్ కోడ్స్ భారత అభివృద్ధి దిశలో మైలురాయి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులుగా ఇవి నిలుస్తాయని చెప్పారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. వీటితో ఉదో ్యగుల భద్రత మరింత బలోపేతమవుతుందని,వేతనాల హామీ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికుల గౌరవం,హక్కులు ప్రాముఖ్యత లభిస్తుందని వివరించారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక రక్షణతో పాటు మహిళలకు మరింత సమానత్వం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. భారత కార్మిక విధానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు సమీపం లోకి తీసుకువచ్చే కీలక అడుగు అని వివరించారు. ఈ చరిత్రాత్మక సంస్కరణలను ఆమోదించిన ప్రధాని నరేంద్ర మోడీకి అభినందలు తెలిపారు.అమరావతి నిర్మాణం కూడా వేగంగా చేపడుతున్నాంప్రతీ ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్త ఉండాలిఏపీ ఇక ఏఐగా మారాలి. విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ వల్ల ఇతర దేశాలకు సేవలు అందుతాయి.2027 డిసెంబర్ కు పోలవరం ప్రాజెక్టుకు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.పీ4 అనుసంధానం ద్వారా పేదలకు చేయూత ఇచ్చి జీవన ప్రమాణాలను పెంచుతాం. 2047 నాటికి భారత్ ప్రపంచలో నెంబర్ వన్ గా మారుతుంది. అందులో స్వర్ణాంధ్ర కూడా అగ్రస్థానంలో ఉంటుంది. తద్వారా ప్రజల ఆర్థిక పరిస్థితి కూడా గణనీయంగా పెరుగుతుంది. ఏపీకి కావాల్సింది సుస్థిరమైన పాలనే అన్నారు.గడిచిన అయిదేళ్లలో మనం ఇటువంటి పండగలు జరుపుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదు. సూపర్ జీఎస్టీ పండుగ చాలా చక్కగా వ్యాపారస్తులు జరుపుకుంటున్నారు. ఒకప్పుడు నాలుగు వస్తువులు కొంటే ఇప్పుడు అదనంగా మరో నాలుగు కొంటున్నారు. దసరా అంటే ఒకప్పుడు కలకత్తా గుర్తు వచ్చేది. కానీ ఇప్పుడు విజయవాడ గుర్తొచ్చే విధంగా ఫెస్టివల్ నిర్వహించారు. రాష్ట్రంలో ఇప్పుడు పాజిటివ్ వైబ్రేషన్ వస్తుంది. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. వెంటిలేటర్ పై ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే. అమరావతి పనులు గాడిలో పడ్డాయి. ఎప్పుడు లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఇస్తున్నాం. సూపర్ జీఎస్టీ ద్వారా సూపర్ సేవింగ్ జరిగాయి. ప్రతి ఒక్క కుటుంబానికీ మేలు జరిగే విధంగా జీఎస్టీ రిఫార్మ్స్ వచ్చాయి అని చెప్పారు.రాష్ట్రంలో మళ్ళీ వైకుంఠపాళి వద్దు. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ప్రాణం పోసింది.16 నెలల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టాం. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉద్యోగులకు కూడా ఆర్థిక ప్రయోజనాలు కల్పించామన్నారు.ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించి తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 9 స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించామన్నారు. 113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 6 వేలకు పైగా ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. అర్చకుల వేతనాల్ని రూ.15 వేలకు పెంచి, ఆలయాల్లో అన్యమతస్తులు లేకుండా చూస్తున్నామని వెల్లడించారు. ఉచిత ఇసుకు విధానం అమలు చేస్తూ భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టి, ఇప్పటివరకు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందించామన్నారు. సైనిక శక్తిలోనూ మనమేంటో ఆపరేషన్ సింధూర్‌తో నిరూపించామన్నారు. శత్రుదేశాలు తూటాలు పేల్చితే మిస్సైళ్లతో బదులిచ్చిన మన త్రివిధ దళాలకు జై కొడదామని పిలుపునిచ్చారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసి సకాలంలో పనులు జరిగేందుకు సహకరించిందన్నారు. 2028 నాటికి జల జీవన్ మిషన్ కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత తాగునీరు అందిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 4,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 250 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించామని తెలిపారు.

## వారం - వర్జ్యం

23-11-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
తదియ రా.7.23
మూల రా.7.26.అనూరాధ కార్తె
వర్జ్యం : ఉ.6.00-7.46
దు.మ.3.59-సా.4.44
ఉ.9.00-9.45
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**వృషభం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. వివాహాది శుభకార్యా యత్నాలు ఫలిస్తాయి.

**మిథునం:** మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుని పనులు చక్కదిద్దుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధికమిస్తారు. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు.

**సింహం:** పారిశ్రామిక రాజకీయ రంగాల వారికి కొంత అనుకూలంగా ఉంటుంది. ఋణాలు తీరుస్తారు. వస్త్రలాభం ఉంది.

**కన్య :** స్తంభించిన కార్యక్రమాలను తిరిగి ప్రారంభించడానికి మీరు చేసే యత్నాలు ఫలిస్తాయి. వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**తుల :** ఆర్థిక విషయాలలో తన పర భేదం ఉండదన్న విషయాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు.పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** సహోదరీ వర్గానికి సహాయ సహకారాలను అందిస్తారు. అయితే మాట తీరు వలన స్వల్పమైన సమస్యలు ఎదుర్కొంటారు.

**ధనుస్సు:** దీర్ఘాలోచనలు కొనసాగుతాయి. సంతాన విషయాలపైన ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. వాహన సౌలభ్యం కలదు.

**మకరం:** కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటారు. ధనాన్ని కన్నా ఆత్మ గౌరవానికి ప్రాముఖ్యత నిస్తారు.

**కుంభం:** మీ ముందు ఒక మాట, మీ వెనుక ఒక మాట చెబుతూ వస్తున్న వారి పట్ల అప్రమత్తంగా మెలగవలసి వస్తుంది.

**మీనం:** ఋణ యత్నాలు ఫలిస్తాయి. తాత్కాలికంగా చేసే నూతన వ్యాపారాలను ప్రారంభిస్తారు. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# డ్రగ్స్, ఉగ్రలింక్‌లు ఛేదించాలి

## జోహాన్స్‌బర్గ్ సదస్సులోన ప్రధాని మోడీ కీలక ప్రసంగం

**జోహాన్స్‌బర్గ్, నవంబరు 22:** దక్షిణాఫ్రికాలోజరుగుతున్న జి20 దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ నాలుగుప్రధాన కార్యాచరణలను ప్రతిపాదించారు. ఈ నాలుగు కీలక కార్యాచరణల్లో గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ, ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనీషియేటివ్, గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటుచేయడంతోపాటు అంతర్జాతీయంగాను జి20 దేశాలమధ్య డ్రగ్స్, ఉగ్రవాదుల లింకులను ఛేదించి ధ్వంసంచేయాలని పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధికి ఎంతో ఆటంకం అడ్డంకి గా మారిన ఈ సంబంధాలను ఆదిలోనే తుంచివేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ నాలుగు కార్యాచరణలతో అన్నిరంగాల్లో సమిష్టి వృద్ధిని సాధించగలుగుతామని అన్నారు. జి20 తొలిరోజు సదస్సు సమ్మిళిత, సుస్థిర అభివృద్ధిపై జరిగింది. భావితరాల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ సాంప్రదాయ విజ్ఞాన రిపాజిటరీవల్ల ఎంతో మేలుచేస్తుందని, సుస్థిర జీవనశైలి అలవడుతుందని, విజ్ఞాన సముపార్జనకు దోహదంచేస్తుందని అన్నారు.

ఇలాంటి సాంప్రదాయ విజ్ఞానం పరంగా భారత్‌కు ఎంతో చరిత్ర ఉందని వీటిని వ్యాప్తిలోకి తీసుకురావడంద్వారా మంచి ఆరోగ్యం, ఉత్తమజీవనశైలికి అలవరిచినట్లవుతుందని అన్నారు. జి20 దేశాల సదస్సుకు హాజరైన మోడీ తొలిరోజు ప్రసంగంలో మాట్లాడుతూ ఆఫ్రికా ఖండం అభివృద్ధి ప్రపంచ ప్రగతికి కీలకమవుతుందని, ఈ ఆఫ్రికా ఖండంపట్ల భారత్ నిరంతరం సంఘీభావంతోనే నడిచిందని చెప్పారు. ఆఫ్రికా నైపుణ్యాల కార్యాచరణతో శిక్షకులకు మరింత శిక్షణ ఇచ్చే వ్యవస్థను ఏర్పాటుచేస్తామన్నారు. దీనివల్ల మిలియన్లకొద్దీ సర్టిఫైడ్ శిక్షకులు తయారవుతారని, ఆఫ్రికాలో వచ్చే దశాబ్దంలోనే పదిలక్షలమంది శిక్షకులను రూపొందించగలమని అన్నారు.

వీరంతా మళ్లీ యువతకు శిక్షణ ఇస్తారని, ఇలా రెట్టింపుస్థాయికి చేరుతూ ఖండం మొత్తం ఉద్యోగార్హత నైపుణ్యాలను కలిగిఉండే యువతను తీర్చిదిద్దుతుందన్నారు. స్థానిక సామర్థ్యం పెంచడంతోపాటు ఆఫ్రికా సుదీర్ఘ అభివృద్ధిని కూడా మరింత శక్తివంతంచేస్తుందని అన్నారు. అలాగే జి20 గ్లోబల్ హెల్త్‌కేర్ స్పందన బృందాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. అత్యవసర వైద్యసమయాల్లో ఈ గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్‌టీమ్ సేవలు వెలకట్టలేనివని ఆయన అన్నారు.

విజయం (వార్త ఆదివారం)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

23-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 292 పేజీలు: 10+4 వెల: 8.00


శనివారం పుట్టపర్తిలోని సత్యసాయిబాబా మహాసమాధి వద్ద అంజలి ఘటిస్తున్న రాష్ట్రపతి ముర్ము

లోక కల్యాణానికే ఆయన ఆవిర్భవించారు..

బాబా శతజయంతి ఉత్సవాలలో రాష్ట్రపతి ముర్ము

మహాసమాధిని దర్శించి నివాళులర్పించిన రాష్ట్రపతి

సత్యసాయి సిద్ధాంతాలకు భక్తులు బ్రాండ్ అంబాసిడర్లు కావాలి: సీఎం చంద్రబాబు

# శాంతి స్వరూపం సత్యసాయి

**పుట్టపర్తి, నవంబరు 22 ప్రభాతవార్త:** సత్యం, మంచి వ్యక్తిత్వం, శాంతి, ప్రేమ వంటిని పాటించాలని సత్యసాయి బాబా నిరంతరం బోధించేవారని, లోక కళ్యాణం కోసం బాబా పనిచేశారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు జాతి నిర్మాణం కోసం పని చేస్తోందని తెలిపారు. పుట్టపర్తిలో జరుగుతోన్న సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు ఆమె హాజరయ్యారు. అంతకు ముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుని వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా మహాద్భాగ్యం. మానవ సేవే మాధవసేవ అని బాబాభావించేవారు. సమాజానికి సేవలందించిన మహానుభావుల్లో సత్యసాయిబాబా అగ్రభాగాన ఉన్నారు. చాలా >>2


జోహాన్స్‌బర్గ్ సదస్సులో మాట్లాడుతున్న పిఎం మోదీ

డ్రగ్స్, ఉగ్రలింక్‌లు

# ఛేదించాలి

జి-20 దేశాలు మరింత సమన్వయంతో సాగాలి 2లో

పత్తి, మొక్కజొన్న, అరటి

# రైతులను ఆదుకోండి

## కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

**సత్యసాయి జిల్లా,(పుట్టపర్తి), నవంబరు 22 ప్రభాతవార్త:** రాయలసీమలో పండిన అరటిని ముంబై లాంటి మార్కెట్ లకు తరలించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ముంబై, కలకత్తా లాంటి ప్రాంతాలకు తరలించి అక్కడి మార్కెట్లలో విక్రయించాలని సూచించారు. అరటి ధరలు, పత్తి,మొక్కజొన్న కొనుగోళ్లపై అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై ప్రతీ రోజూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహారాష్ట్ర లాంటి ప్రాంతాల్లో ఉన్న మార్కెట్లకు అరటి లోడుతో కూడిన రైల్వే వ్యాగన్లను పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం >>2






# పరీక్షల భయంతోనే విద్యార్థుల ఆత్మహత్యలు

ఇక సాధారణంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థుల్లోనూ కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. హాస్టల్స్‌లో తోటి విద్యార్థుల వేధింపులతోపాటు, ఉద్యోగుల వేధింపుల కారణం కూడా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో లైగింక వేధింపుల మూలంగా కూడా విద్యార్థిని, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సాధారణంగా హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో చదివే విద్యార్థులే కాకుండా .. ఇంటర్, డిగ్రీ, యూనివర్సిటీ, ఎంబిబిఎస్, ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో చేరిన వారు కూడా అక్కడ వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో కాలేజీలు, యూనివర్సిటీలు, ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ఫీజులుఎక్కువగా ఉన్నచోట ఫీజులను సరైన సమయానికి చెల్లించకపోతే.. యాజమాన్యాల వేధింపుల మూలంగా ఆత్మహత్యలు చేసుకుం




టున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. ఏమైనా విద్యార్థుల ఆత్మహత్యలకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, యాజమాన్యాలు, పాఠాలు బోధించే టీచర్లు, లెక్చరర్లు కూడా కారణంగా ఉంటున్నారు. మొత్తంగా విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, లెక్చరర్ల తీరులో మార్పురావల్సి ఉంది. విద్యార్థులు ఫెయిలైనప్పటికీ వారిని మందలించకుండా తదుపరి ఏమీచేయాలో ఆలోచించేలా తల్లిదండ్రులు వ్యవహరించడంతోపాటు విద్యార్థులపై వేధింపులు లేకుండా పాఠాలుబోధించే టీచర్లు, లెక్చరర్లు, తోటి విద్యార్థులు వ్యవహరించాల్సిన అవసరం ఉంటుందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మరికొద్ది రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పోటీ పరీక్షలతోపాటు, వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయి. పరీక్షలంటే ఇటు విద్యార్థులతోపాటు.. అటు తల్లిదండ్రుల్లోనూ టెన్షన్ పెరుగుతుంది. వార్షిక పరీక్షల కంటే పోటీ పరీక్షలైతే ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది. పరీక్షల భయంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు ప్రతి ఏడాది చూస్తూనే ఉంటాము. విద్యార్థుల ఆత్మహత్యలకు పరీక్షల భయం ఒక్కటే కాకుండా.. ఇంకా అనేక కారణాలు ఉంటున్నాయి. స్కూల్‌లో ఉపాధ్యాయులు అవమానించారని. తోటి విద్యార్థులు ఎగతాళి చేశారని, తక్కువ మార్కులు వచ్చాయని ఇలా ఇతర కారణాలు కూడా ఉంటున్నాయి. మరికొన్ని సంఘటనల్లో అయితే కార్పొరేట్ కాలేజీల్లో చేరిన విద్యార్థులు అక్కడి వాతావరణానికి తట్టుకోలేక, చదువుపై ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ మధ్య కాలంలో టీచర్ల వేధింపుల మూలంగా తనువు చాలిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా విద్యార్థులు వార్షిక పరీక్షలంటే భయపడతారు. ఆ పరీక్షల్లో ఫెయిల్ అవుతామో మోననే భయంతో కొందరు విద్యార్థులు పరీక్షలకి ముందే చనిపోతుంటే.. మరికొందరు పరీక్షలు రాసిన తరువాత మంచి మార్కులు రావని, పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వార్షిక పరీక్షల భయం కాకుండా పోటీ పరీక్షల భయం మూలంగా మరికొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మెడిసిన్‌లో సీట్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్షల్లో తాము మంచి మార్కులు సాధించలేమని ముందుగానే ఊహించుకుని పరీక్షలకు సిద్ధమవుతున్న సందర్భంలోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీట్ల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామన(జేఈఈ)లో ర్యాంక్ సాధించలేమని భావించే విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటూ ఆ భోజనాన్ని తినలేక, హాస్టల్స్‌లో ఉండలేక తల్లిదండ్రులకు చెప్పినా ఫలితం ఉండదని భావించి చనిపోతున్నారు. ఇలా

**నాగమణీంద్ర పల్లాపు**

కర్ణుడి చావుకి సవాలక్ష కారణాల మాదిరిగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి పలు కారణాలు ఉంటున్నాయి. విద్యార్థులు ఆత్మహత్యలకు ప్రధానంగా కారణాలు రెండు. మొదటిది వార్షిక పరీక్షల్లో ఫెయిల్ కావడమైతే రెండోది పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులను సాధించేమనే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ రెండుకారణాలతో మరణిస్తున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇది ఏఒక్క రాష్ట్రం



లోనూ జరగడం లేదు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా జరుగుతోంది. విద్యార్థుల ఆత్మహత్యలు పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లోనూ జరుగుతోంది. ఏడాదంతా చదివి ఎగ్జామ్స్ రాసే పిల్లలకు ఎంత టెన్షన్ ఉంటుందో దానికి పదింతలు పేరెంట్స్ టెన్షన్ పడతారు. పిల్లలకు ఎగ్జామ్‌లో మార్కుల రాకపోతే పేరెంట్స్ తిడతారనే భయం, ఫెయిల్ అయితే కొడతారనే భయంతో ఒత్తిడికి గురై విద్యార్థులు సూసైడ్‌కి పాల్పడుతున్నారు. చదువులో ఫెయిల్ అయినందుకు స్టూడెంట్ సూసైడ్ చేసుకుంటున్నారనుకుంటే అందుకు కారణం. ఇంట్లో అమ్మానాన్న ఏమంటారోసొసైటీ ఎలా చూస్తుందో అనే భావనతోనే సగానికి పైగా స్టూడెంట్స్ చనిపోతున్నారు. పిల్లాడు లేదా పిల్ల చనిపోయిన తర్వాత మేము ఏమంటాము బతికుంటే ఇంకేదైనా పని చేసుకునేవాడివి అని ఏడుస్తారు కానీ ఉన్నప్పుడు మేము న్నామనే భరోసా ఇచ్చే తల్లిదండ్రులు చాలా తక్కువ మంది ఉంటారు. చదువు కాకుండా వారికి దేనిమీద ఇంట్రస్ట్ ఉందో తెలుసుకుని అటువైపుగా వారు రాణించేలా చూసుకోవాలి. అలాచేస్తే విద్యార్థుల ఆత్మహత్యలు చాలావరకు తగ్గే అవకాశం ఉంటుంది. మంచి మార్కులు తీసుకుచ్చి స్టేట్ లెవెల్‌లో టాప్ టెన్‌లో నిలవాలని విద్యార్థులపై తల్లిదండ్రుల ఒత్తిడి ఓ వైపు కాలేజీకి మంచి పేరు తీసుకుచ్చి మార్కెటింగ్ చేసుకోవాలన్న తపనతో కాలేజీ యాజమాన్యం ఒత్తిడి మరోవైపు వెరసి విద్యార్థుల ప్రాణాలకే ప్రమాదంగా మారుతున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యలు టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైన సందర్భాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చినపుడు, ఎస్ఎస్‌సి ఫలితాలు వచ్చినప్పటి నుంచి రెండు, మూడు రోజులవరకు విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు జరుగుతున్నాయి. విద్యార్థులు పరీక్షలను బాగా రాశామని భావించినప్పటికీ ఒక్కో సందర్భంలో వారు ఫెయిలైతే దానిని తట్టుకోలేక చనిపోతున్నారు. పరీక్షల ఫలితాలు వెలువడే దానికంటే ముందుగానే విద్యార్థులు తాము పరీక్షల్లో ఫెయిలవుతామనే భయంతో కూడా కొందరు విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అయితే ఈమధ్య కాలంలో ఇలాంటి భయంతో ఆత్మహత్యలకు పాల్పడి వారు పరీక్షల్లో మంచి మార్కులను తెచ్చుకున్న సంఘటనలుకూడా జరిగాయి. ఇలా టెన్త్, ఇంటర్‌పరీక్షల భయంతో చనిపోతున్న వారి సంఖ్య పదుల సంఖ్యలో ఉంటుంది. ఇది కాకుండా నీట్, జేఈఈ, సీఏ వంటి పోటీ పరీక్షల్లో తాము మంచి ర్యాంకులను సాధించలేమని భయంతో ఒత్తిడికి గురై చనిపోతున్న వారి సంఖ్య గత నాలుగైదేళ్లుగా పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా నీట్‌లో ర్యాంక్‌రాదనే భయంతో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. గత మూడు, నాలుగేళ్లుగా ఏడాదిలో కనీసం 20కి తగ్గకుండా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నీట్‌కి కోచింగ్ ఇస్తున్న కోటా నగరంలోనే ఎక్కువమంది విద్యార్థులు చనిపోతున్నారు. 2023లో 22 మంది చనిపోగా, 2024లో 25 మంది చనిపోయారు. ఈ ఏడాది కూడా ఇప్పటికే సుమారు 18 మంది చనిపోయినట్టు పోలీసుల లెక్కలు చెబుతున్నాయి. నీట్‌కి కోచింగ్ ఇస్తున్న సంస్థలు రాజస్థాన్‌లోని కోటాలోఎక్కువగా ఉండటం ఇందుకు కారణం. గత మూడు, నాలుగేళ్లుగా కోటాలో జరుగుతున్న ఆత్మహత్యలను సీరియస్‌గా తీసుకున్న అక్కడి రాష్ట్ర ప్రభుత్వం స్టూడెంట్స్ సూసైడ్‌ల నివారణకు మార్గాలను అన్వేషిస్తూ ఆత్మహత్యల నివారణకు తగిన మార్గాలను చెప్పాలని విద్యారంగ నిపుణులకి సూచించడమే కాకుండా కోటింగ్ సెంటర్లకి సీరియస్‌గా వార్నింగ్ కూడా ఇచ్చింది. ఇవేకాకుండా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులుఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వారిలో ఎక్కువశాతం అప్పటివరకు అంటే 10వ తరగతి వరకు తల్లిదండ్రుల దగ్గర ఉండి చదువుకున్న విద్యార్థులు ఒక్కసారిగా హాస్టల్‌లో ఉండిచదువుకోవల్సి రావడం అదీ కూడా 24 గంటలకు ఒకటే చదువు, చదువు అని ఒత్తిడి చేయడంతో మానసికంగా తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లోఉండి చదువుతూ ఆత్మహత్యలకు పాల్పడుతూవిద్యార్థులు సూసైడ్ నోట్లను రాస్తున్నారు. వాటిలో ప్రధానంగా ఒత్తిడిని తట్టుకోలేక తమకు ఇష్టంలేకున్నా హాస్టల్‌చేర్పించడంతోపాటు.. తాము వేరేకోర్సులో చేరాలనుకుంటే బలవంతంగా తల్లిదండ్రులు తమకు నచ్చిన కోర్సులో చేర్పించడంతో ఇదే విషయాన్ని సూసైడ్‌లో నోట్‌లో రాస్తూ తమ్ముడు, చెల్లి విషయంలో ఇటువంటి నిర్ణయం తీసుకోవద్దని చెబుతూ ఆత్మహత్య చేసుకున్న ఘటనలు జరుగుతున్నాయి. ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటీలు, యూనివర్సిటీల్లోనూ కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారు సైతం ఒత్తిడిని తట్టుకోలేక చనిపోతున్నట్టు లేఖలు రాసిన మరణిస్తున్నారు. ●

# సుఖాంతమేనా!

కర్ణాటక

**ఎ.వి.వి ప్రసాద్**

నిప్పు లేనిదే పొగ రాదంటారు. అది నిజమే. కానీ వ్యాపించిన దట్టమైన పొగ వెనుక ఎలాంటి నిప్పు లేదంటున్నారుముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్. అయితే అంత దట్టమైన పొగ వారం రోజులుగా వ్యాపించినా, దానివెనుక ఎలాంటి నిప్పులేదనడం విడ్డూరమే. రెండున్నరేళ్ల క్రితం భారీ మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆ ఇద్దరు అధినాయకుల మధ్య గట్టి పోటీయే తలెత్తింది. ఏదో మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతోందని అభిమానులు సంతోషిస్తుంటే, ఈ బెడద ఏమిటని పార్టీఅధిష్ఠానం తలపట్టుకొంది. కర్ణాటకలో కాంగ్రెస్ కనుమరుగవుతున్న దశలో తిరిగి పార్టీలో జవసత్వాలు నింపింది తానేననీ, పార్టీ తిరిగి అధికారంలోకి రావడంలో తనవంతు సింహభాగమనీ సింహంలా గర్జించారు డికె. ఆయన అప్పటికే పిసిసి చీఫ్‌గా ఉన్నారు. అధిష్ఠానం ఏదోవిధంగా నచ్చజెప్పి, చివరికి సిద్ధరామయ్యకే సింహాసనం అప్పగించింది. ముఖ్యమంత్రిగా ఆయనకు గల గత అనుభవం, సామాజిక కారణాలు అందుకు కొంత పనిచేశాయి. రెండున్నరేళ్లు సిద్ధరామయ్యకు, తర్వాత రెండున్నరేళ్లు డికెకు అధికార పంపిణీ జరిగేట్లుగా అధిష్ఠానం నచ్చజెప్పిందనీ, అందుకే అప్పటికిసమస్య పరిష్కారమైందనీ ప్రచారం జరిగింది. అటువంటి 'పంపకం' రాజకీయాలలో కొత్త కాదు కనుక, 'కాబోలు' అనే అంతా అనుకొన్నారు. ఈలోగా రెండున్నరేళ్లు గిర్రున తిరిగాయి. అప్పటి 'ఒప్పందం' ప్రకారం ఇప్పుడు డికె వంతు వచ్చిందనే అంతా భావించారు. ఆయన కూడా అందుకు తగినట్లుగానే రెండు మూడు వారాలుగా కొన్ని ప్రకటనలు చేస్తూ వచ్చారు. 'అయిదేళ్లు నేనే ముఖ్యమంత్రిని' అంటూ సిద్ధరామయ్య గంభీరంగానే చెబుతున్నా మధ్యమధ్యలో డికె 'భగవంతుడు ఏమనుకొంటున్నాడో, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకొంటుందో' అంటూ సొంత రాగం వినిపిస్తుండడంతో ఆయన అభిమానులంతా ఖుషీ అయిపోయారు. 'మా డికె నే ఇక సిఎం' అంటూ అభిమానులు తయారు చేసిన హోర్డింగులు కూడా ఇటీవల బెంగళూరులో దర్శనమిస్తుండడంతో తెరవెనుక జరుగుతున్న కథ ఏమిటో అందరికీ అర్థమైపోయింది. ముఖ్యంగా గత వారం రోజులుగా ఇటు బెంగళూరు, అటుఢిల్లీలో కూడా ఇద్దరు నాయకుల అనుచరులు చేసిన హడావుడి చూసి ఏదో జరగబోతోందనే అంతా భావించారు. నవంబరు 20తేదీతో రెండున్నరేళ్లు పూర్తవుతుంది కనుక 21 నుంచి డికె ప్రభుత్వం ఏర్పాటవుతుందనే ప్రచారం జోరుగా సాగిపోయింది. సిద్ధరామయ్యతో తనకు ఎలాంటి విభేదాలు లేవంటూనే 'ఎమ్మెల్యేలంతా నా వాళ్లే'అని డికె చేసిన ప్రకటనలతో మరింత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దాదాపు 15 మంది ఎమ్మెల్యేలు, డజను మంది ఎమ్మెల్సీలు వారం రోజులుగా ఢిల్లీలోనే ఉండి డికెకు మద్దతుగా పావులు కదిపారనీ, అధిష్ఠానంపై ఎంతో ఒత్తిడి తెచ్చారనీ ప్రచారమైంది. వారు అక్కడ ఏం చేశారన్నదానిపై



సిద్ధరామయ్య

భిన్న కథనాలు వచ్చినా, ఓ పాతిక మంది డికె మద్దతుదారులైన ప్రజాప్రతినిధులు ఢిల్లీలో తమ వంతు ప్రయత్నాలు చేశారన్నది మాత్రం నిజం. ఓ నాలుగు రోజులు డికె, సిద్ధరామయ్య కూడా ఢిల్లీలోనే ఉన్నారు. వారిద్దరూ అధిష్టానంతో వేర్వేరుగా చర్చలు జరిపారు. ఇటీవల బీహార్లో కంగుతిన్న కాంగ్రెస్ కర్ణాటక సమస్యలో తలదూర్చలేక 'మీ తిప్పలు మీరు పడండి' అని వారికి చెప్పి పంపినట్లుగా వినిపించింది. మంత్రివర్గ విస్తరణ జరిపితే సమస్య పరిష్కారం కావచ్చని సిద్ధరామయ్య చెప్పగా చివరికి ఖర్గే అంగీకరించారనీ, ఈ విషయంలో డికెకూడా తనకు అభ్యంతరంలేదని అన్నారనీ తెలిసింది. విస్తరణలో డికె ముఖ్య అనుచరులకు మంత్రిపదవి లభిస్తే మిగిలిన రెండున్నరేళ్లు ఎటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం నడుస్తుందనే రాజీసూత్రం ఫలించినట్లే కనిపిస్తోంది. మూడు నాలుగు రోజులు ఢిల్లీలో ఈ విషయంపై తీవ్ర స్థాయి చర్చలు జరిగిన తర్వాత సిద్ధరామయ్య శుక్రవారం ఒక ప్రకటన చేస్తూ 'పూర్తికాలం నేనే ముఖ్యమంత్రిని' అనడం, ఆతర్వాత కొద్దిసేపటికి డికె కూడా'ఆయనకు మా శుభాకాంక్షలు' అనడంతో సమస్య పరిష్కారమైనట్లు కనిపించింది. మామూలు పరిస్థితిలోనైతే అధికారమార్పిడి జరిగి డికెముఖ్యమంత్రి అయ్యేవారనీ, కానీ బీహార్‌లో తిన్నదెబ్బతో కర్ణాటకలో ప్రయోగం చేయడానికి పార్టీ అధిష్ఠానం సాహసించలేదనీ తెలుస్తోంది. డా. రంగనాథ్, బాలకృష్ణ, ఇక్బాల్ హుస్సేన్ వంటి డికె మద్దతుదారులు రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి అధికార మార్పిడి గురించి ప్రస్తావించగా, 'కొత్త తలనొప్పిని సృష్టిస్తారా!'అని ఆయన వారిని వారించినట్లుగా చెబుతున్నారు. తర్వాత వారంతా ఖర్గేను కలుసుకొని మంత్రివర్గ విస్తరణ జరిపించాలని పట్టుపట్టడం, సిద్ధరామ య్య కూడా అదే అభిప్రాయంతో ఉండడంతో ఖర్గేదానిని ఆమోదించడంజరిగినట్లుగా తెలుస్తోంది. ఎంపి అయిన డికె సోదరుడు సురేష్ రాహుల్‌తో గల సాన్నిహిత్యంతో చక్రం తిప్పడానికి ప్రయత్నించారనీ, అయితే ఆయనకు కూడా రాహుల్ తొందరపడొద్దని సూచించారనీ తెలిసింది. 2028లో జరిగే ఎన్నికలు చాలా కీలకం గనుక మళ్లీ పార్టీని అధికారంలోకి తేవడంపై మాత్రమే అందరూ దృష్టి పెట్టాలనీ, కొత్త తలనొప్పులు సృష్టించరాదనీ రాహుల్ వారిని హెచ్చరించినట్లు కూడా తెలిసింది. డికెను ముఖ్యమంత్రిని చేయకపోతే రాజీనామా చేస్తామంటూ పది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు సిద్ధపడినట్లు కూడా పొగవ్యాపించింది. అయితే వారందరినీ అధిష్ఠానం బుజ్జగించి, సిద్ధరామయ్యను మార్చితే ఎదురుకాగల పరిస్థితిని వివరించిందనీ, ప్రస్తుతానికి అందరూ నిశ్శబ్దంగా ఉండాలని సూచించిందనీ తెలుస్తోంది. ఈ 'మార్పిడి' సమస్యతో పాలన మందగించిందనే అభిప్రాయం కూడా ఉంది. ప్రస్తుతం అధికార మార్పిడి సమస్య కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది గనుక పాలన ఇక మెరుగుపడవచ్చనే భావించాలి. పొగ వెనుక నిప్పు ప్రస్తుతానికి చల్లారినట్లే అనుకోవాలి. ●

# ట్రంప్ 'శాంతి' మెలిక!

ఉక్రెయిన్

**గన్ని మోహన్**

ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దండయాత్రను కట్టడిచేసి ఇరు వైపులా శాంతిస్థాపనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న కార్యాచరణ ఎప్పటికీ కొలిక్కివచ్చేదిగా కనిపించడంలేదు. తాజాగా 28 అంశాలతో రూపొందించిన ఒప్పంద ముసాయిదాలో మూడొంతులు రష్యాకు మేలు చేసేవిగానే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ అమెరికా చెప్పినట్లు నడుచుకోవాల్సిన పరిస్థితులకు ట్రంప్ రూపకల్పన చేసారనిపిస్తోంది. సుదీర్ఘ సైనిక పోరాటంలో అలిసిపోయిన ఉక్రెయిన్ దేశానికి అంతోఇంతో సాయంచేసి యుద్ధాన్ని నివారించాల్సిన పెద్దన్నఏకపక్షంగా రష్యాకు అనుకూలంగా ఒప్పంద పత్రాన్ని రూపొందించడంపైగా తన ప్రతినిధులతో ఉక్రెయిన్ అధ్యక్షుడికి అందచేయడం చూస్తుంటే రష్యాకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఇక అజెండా అంశాలను చూస్తే నాటోలో ఉక్రెయిన్ చేరకూడదు, నాటో దళాలు ఉక్రెయిన్‌లో బసచేయకూడదు. ఉక్రెయిన్ సైన్యాన్ని 8.80 లక్షల నుంచి 6లక్షలకు తగ్గించుకోవాలి. ఇప్పటికే రష్యా ఆక్రమణలో ఉన్న లుహాన్స్, డోనెట్స్క్, ఖెర్సన్ ప్రాంతాలు రష్యాకు వదిలివేయాలి వీటితోపాటే 2014లో రష్యాదండయాత్రచేసి ఆక్రమించుకున్న క్రిమియా ప్రాంతం కూడా రష్యాదే అవుతుందని వీటిలో కీలకఅంశాలుగా పొందుపరిచారు. అంతేకాదు రష్యా భూభాగంపైకి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఆయుధప్రయోగం చేయకూడదు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఉన్న ఝపోరిజియా అణుకేంద్రంవిద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి వచ్చే ఉత్పాదకతను రష్యా ఉక్రెయిన్‌కు సమాన పంపిణీ చేయడం వంటివి ఉన్నాయి. ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక ఆర్థికసాయం తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఉక్రెయిన్ భూభాగంలో విదేశీ బలగాలను అనుమతించకూడదు. రష్యాపైకి దాడి చేసే సామర్థ్యం ఉన్న ఆయుధాలను ఉక్రెయిన్‌కు మరే ఇతర దేశం కూడా అందించకూడదు అన్న కీలక నిబంధనలు విధించారు. వీటితోపాటుగానే రష్యాపై ఉన్న ఆంక్షలు పూర్తిగా ఎత్తివేయడం, స్తంభింపచేసిన ఆస్తులనుంచి వచ్చే మొత్తం ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి 50 శాతం వెచ్చించడం, 50శాతం అమెరికా లాగేసుకోవడం వంటివి ఉన్నాయి. ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్న యూరోపియన్ దేశాల యుద్ధవిమానాలు పోలండ్‌లో ఉంటాయి. రష్యా తిరిగి ఉక్రెయిన్‌పై దండయాత్రలు చేస్తే అంతర్జాతీయంగాఉన్న ఆంక్షలు అలాగే కొనసాగుతాయి. కొత్తగా వచ్చిన ప్రాదేశికప్రాంతాన్ని గుర్తించకపోవడం, అన్ని ప్రయో జనాలనున రద్దుచేయడం వంటివి చేస్తుంది. ఐరోపాలో ఉక్రెయిన్ సభ్యత్వం పొందవచ్చు. ఉక్రెయిన్ డెవలప్‌మెంట్‌ఫండ్ ఏర్పాటుచేసి పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, టెక్నాలజీ, డేటాసెంటర్లు, ఎఐ వినియోగం వంటి వాటిని అమెరికా చూస్తుంది. అమెరికా దీర్ఘకాలిక ప్రాతిపదకన ఉక్రెయిన్‌లో సహజవనరులు, విద్యుత్, మౌలికవనరులు, ఎఐ, డేటా సెంటర్స్, రేర్ ఎర్త్‌మెటల్ అన్వేషణ ప్రాజెక్టులు పర్యవేక్షిస్తుంది. పరస్పరప్రయోజనాల ఆధారంగా వీటిపై పనిచేస్తుంది. అన్నింటికంటే ముందు రష్యాను జి8 కూటమిలోకి తిరిగి ఆహ్వానిస్తుంది. మొత్తం 28 పాయింట్లతో కూడిన ఈ ఒప్పంద పత్రం చూస్తుంటే ట్రంప్ ఆదేశాల మేరకు రష్యాకు మొత్తం అనుకూలంగా రూపొందించినట్లు కనిపిస్తోంది. ఇదే కనుక అమలులోకి వస్తే జెలెన్స్కీకి అయినా ఉక్రెయిన్ ప్రజలకు అయినా ఆత్మహత్యా సదృశ్యమేనని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇన్నాళ్లుగా ఇంచుమించు 2022నుంచి పోరాడుతూ వస్తూఎక్కడా మడమతిప్పకుండా ప్రపంచదేశాల మద్దతును పొందుతున్న ఉక్రెయిన్ హఠాత్తుగా ట్రంప్ రూపొందించిన ప్రణాళికకు తలొగ్గితే ఇక భవిష్యత్తు మొత్తంఅమెరికాకు బానిస బతుకుగా కొనసాగాల్సిందేనన్న వాదన కూడా ఉక్రెయిన్ ప్రజల్లో పెరిగింది. అందులోనూ ట్రంప్ మొదటి నుంచి కూడా రష్యా ఆక్రమించిన ప్రాంతాలు రష్యాకే ఇచ్చేయాలని పట్టుబడుతున్నారు. ఒకదశ లో జెలెన్స్కీని బెదిరించే ప్రయత్నాలు కూడా చేసిన సంగతి తెలిసిందే. మీడియా ముందే జెలెన్స్కీని అవమానించిన ట్రంప్ తాజాగా మళ్లీ ఈ శాంతి ఒప్పందానికి కేవలం రష్యాను బుజ్జగించడం కోసమే చేస్తున్నారనిపిస్తోంది. ఉక్రెయిన్‌ను ఏకాకిని చేసి ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు చేయిస్తోందని ఇప్పటికే యూరోపియన్ దేశాలు ధ్వజమెత్తుతున్నాయి. అందుకు తగ్గినట్లుగానే ఈ 28పాయింట్ల అజెండా కూడా ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇకపై ఎలాంటి చర్చలు జరిగినా ఐరోపా కూటమి నిర్ణయించిన ప్రతినిధుల సమక్షంలోనే జరగాలని యూరోపియన్ కమిషన్ కూడా పట్టుబట్టడంతో ట్రంప్ కొంత వెనక్కి తగ్గే పరిస్థితి వచ్చింది. రష్యాకోసం ఇంత పరితపించిపోతున్న ట్రంప్ ప్రతిపాదనలకు కేవలం రష్యా ప్రతినిధి స్పందించారేకానీ ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌నుంచి ఒక్కమాటకూడా వెలువడకపోవడం గమనార్హం. మొత్తంగా చూస్తుంటే ఉక్రెయిన్‌ను క్రమేపీ తమరష్యన్ ఫెడరేషన్‌లోనే విలీనం చేసేసుకోవాలన్న లక్ష్యంతోనే ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకు తగినట్లుగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కూడా తాను ఎన్నికైనప్పటినుంచి పుతిన్‌కు మద్దతుగానే వ్యాఖ్యలు చేస్తుండటం చూస్తుంటే జెలెన్స్కీపై ఒత్తిడి తెచ్చి శాంతి ఒప్పందంపేరిట ఈ డీల్‌పై సంతకం చేయించాలని చూస్తున్నారు. అమెరికాకు అంత అభిమానం హఠాత్తుగా రావడానికి కారణం కూడా లేకపోలేదు. ఉక్రెయిన్‌లో ఉన్న అత్యంత అరుదైన ఖనిజ వనరులు అపారంగా ఉన్నాయి. వాటిని తవ్వితీసే ప్రాజెక్టును తామే తీసుకోవాలన్న లక్ష్యంతో శాంతి శాంతి అంటూ ఉక్రెయిన్‌పై కపటప్రేమ ప్రదర్శిస్తోంది. ఈ అజెండాపై జెలెన్స్కీ కూడా ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఒక మంచి మిత్రుడినికోల్పోవాలా, ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టాలా అన్న మీమాంసలో ఉన్న జెలెన్స్కీ ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని మాత్రం ఇతరులచేతికి అందించబోమన్న దృఢనిర్ణయం ఆయనలో కనిపిస్తోంది. ●




జెలెన్స్కీ

# ప్రపంచాన్ని శాసిస్తున్న శాస్త్ర,సాంకేతిక రంగాలు



**సుంకవల్లి సత్తిరాజు**

అక్షరాలు దిద్ది, పుస్తకాలను చదివి, అహరహం శ్రమించి అనుభవాలను పాఠాలుగా నేర్చుకుని, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా జీవిత సాగరాన్ని నెట్టుకొచ్చే ఓర్పు, నేర్పు గతించిన తరాలకు పుష్కలంగా ఉండేది. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో డబ్బుంటే చాలు సౌకర్యవంతమైన జీవితం మన సొంతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జీవితాలను, భారంగా, అసౌకర్యంగా నెట్టుకొచ్చే కాలం గతించింది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, సైన్స్ ఫలితాలు అరచేతిలో ప్రపంచాన్ని మనముందు సాక్షాత్కరింప చేస్తున్నాయి. నేటి ప్రపంచాన్ని సైన్స్ టెక్నాలజీ శాసిస్తున్నాయి. సైన్స్‌ను టెక్నాలజీని విభజించి చూడలేం. సైన్స్ అనే మహావృక్షానికి చెందిన ఫలమే టెక్నాలజీ. నేడు ప్రపంచం ఇంతగా అభివృద్ధి చెందడానికి పెరిగిన సాంకేతిక పరిజ్ఞానమే కారణం. అనేక రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో పెనవేసుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థలన్నీ టెక్నాలజీ సాయంతో నడుస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీ అనేక అద్భుతమైన ఫలితాలకు ఆలవాలంగా మారింది. విద్య వైద్య, ఇంజనీరింగ్, కళా సాంస్కృతిక రంగాలు టెక్నాలజీ వలన వినూత్నమైన రూపం సంతరించుకున్నాయి. అనేక వ్యాధులకు చికిత్సనందించడంలోను, శస్త్రచికిత్సల్లోను సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతున్నది. విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు అందుబాటులోకి రావడంతో నేర్చుకునే ప్రక్రియ సులభతరంగా మారింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో సరికొత్త మార్పులొచ్చాయి. నేర పరిశోధనలో టెక్నాలజీ పాత్ర కీలకంగా మారింది. సమాచార వ్యవస్థ స్వరూప స్వభావాలు మారిపోయాయి. ఇంటర్నెట్‌లో సకల సమాచారం లభ్యమవుతున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అత్యంత వేగంగా విస్తరించే అవకాశముంది. ఇప్పటికే ఏఐ ప్రకంపనలు మొదలయ్యాయి. గూగూల్ సెర్చ్ ఇంజన్ కూడా అదృశ్యమయ్యే అవకాశముంది. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' మానవ జీవితాలను శాసిస్తున్నది. ప్రయోజనాలతో పాటు అనేక విపరీత పరిణామాలకు కూడా విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేయడం బాధాకరం. ఇది కేవలం మానవ తప్పిదం. సైన్స్‌ను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో మంచి చెడుల విచక్షణ అవసరం. ఇప్పటికే సాంఘిక మాధ్యమాలు హోరెత్తిపోతున్నాయి. విద్యార్థులు, యువతతో పాటు విద్యాధికులు, పెద్దలు సైతం సోషల్ మీడియా కబంధ హస్తాల్లో చిక్కుకుని, వాటికి దాసోహమై మానవ సంబంధాలకు తిలోదకాలిస్తున్నారు. వేగవంతమైన ఇంటర్నెట్ వలన అనేక యూట్యూబ్ ఛానళ్లను ప్రజలు యధేచ్ఛగా చూడగలుగుతున్నారు. మెయిన్ స్ట్రీమ్ ఛానళ్ల కంటే యూట్యూబ్ ఛానళ్ల ప్రభావమే అధికంగా కనిపిస్తున్నది. అసభ్యకరమైన కంటెంట్ యువత జీవితాలను నాశనం చేస్తున్నది. అనేక పోర్న్‌సైట్లు అందుబాటులోకి వచ్చాయి. ధనార్జనే ధ్యేయంగా భావించి విలువలకు తిలోదకాలిస్తూ, నగ్న సంస్కృతిని ప్రోత్సహిస్తూ, బ్లాక్‌మెయిలింగ్ పద్ధతులకు పాల్పడడం వలన సమాజంలో ఆటవిక ప్రవర్తన పెరిగిపోయే అవకాశాలు ఏర్పడ్డాయి. మహిళలను, బాలికలను బెదిరిస్తూ, బాధిస్తూ, మానసిక, లైంగిక హింసలకు గురిచేస్తున్న వారిని శిక్షించడం కష్టసాధ్యంగా మారింది. అంతర్జాతీయ స్థాయిలో సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయకపోతే మోసాలే మానవ నైజంగా మారి, హింసా ప్రవృత్తి పెరిగేపోయే అవకాశముంది. ఆన్‌లైన్ గేమింగ్ ప్రక్రియలు వ్యసనంగా మారిపోతున్నాయి. కల్పితాలతో కూడిన కంటెంట్‌తో మానవ జీవితాలు అల్లకల్లోలమయ్యే పరిస్థితులకు సైన్స్ అండ్ టెక్నాలజీ కారణం కారాదు. ఎన్ని విజయాలు సాధించినా, ప్రపంచం వైజ్ఞానికంగా ఎంతగా ముందుకు దూసుకుపోతున్నా, శాస్త్రవేత్తల పరిశోధనలు ఆగలేదు. అనేక విషయాలపై నేటికీ విస్తృతంగా పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో మనిషి మృత్యువును కూడా జయించగలడేమో అనే నమ్మకం కలుగుతున్నది. ప్రస్తుతం శాస్త్ర



సాంకేతిక రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు ఈ నిజానికి బలం చేకూర్చుతున్నాయి. మనిషి ఆయుస్సును పెంచడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. 'ఏజ్ రివర్సింగ్ ప్రాసెస్' ఎలాంటి సత్ఫలితాలనిస్తుందో వేచిచూడాలి. మానవ కణాలను, శరీర అవయవాలను మార్చి, ఎలాంటి రోగాలు లేకుండా మనిషి వందలాది సంవత్సరాలు జీవించడం కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. మనిషి మెదడులో మైక్రోచిప్ అమర్చడానికి జరుగుతున్న ట్రయల్స్‌గురించి, చిప్ ట్రాన్స్ ఫ్లాంటేషన్ ప్రక్రియ గురించి వింటుంటే మానవ జీవితాలు భవిష్యత్తుల్లో ఎలాంటి మార్పులు సంతరించుకుంటాయో ఊహించుకోవడానికే భయం కలుగుతుంది. మానవ మేథస్సుకు కృత్రిమ మేథస్సుతోడుకావడం భవిష్య పరిణామాలపై ఆసక్తితో పాటు, భయోత్పాతం కలగడం సహజం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారకూడదు. శాస్త్ర పరిశోధనలకు ఉపక్రమించే ముందు వాటి వలన ఏర్పడే విపత్కర పరిణామాల గురించి ముందే ఆలోచించాలి. ఇప్పటికే పెరిగిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వలన మానవ జీవితం అనేక మలుపులు తిరిగింది. కొన్ని ఊహించని పరిణామాలు కూడా సంభవించాయి. భూగోళంపై కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. భూఉపరితలం వేడెక్కిపోతున్నది. నదులు, ఇతర జలరాశులు అంతరించే ప్రమాదం పొంచి ఉంది. శీతల దేశాల్లో కూడా అధికఉష్ణోగ్రతల వలన తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంది. రసాయనాలతో నిండిన ఆహారాన్ని భుజిస్తూ, కృత్రిమమైన జీవన శైలితో, అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, నిరంతరం ఔషధాలను ఉపయోగిస్తూ, జీవచ్ఛవాల్లా బ్రతుకీడ్చే పరిస్థితులకు కారణం ఏమిటి? విజ్ఞానం పెరిగి, వినాశనానికి దారితీస్తే, మానవ మనుగడ అసాధ్యం. మానవ అవసరాలకు కావలసిన సహజ వనరులు తరిగిపోతున్నాయి. భూగర్భ సంపదను విచక్షణారహితంగా వాడేస్తున్నాం. సముద్రాలను కలుషితం చేస్తున్నాం. ప్రయోగాల పేరుతో అంతరిక్షాన్ని ఒక డంపింగ్ యార్డ్‌లా మార్చేస్తున్నాం. ప్రకృతిని విధ్వంసం చేసి, భూగోళాన్ని మృతగోళంగా మార్చే విధంగా మన ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రోబోల శకం రాబోతున్నది. మానవ ప్రమేయం లేని 'మర మనుషుల లోకం' ఆవిర్భవించబోతున్నది. ఇవన్నీ ఆందోళన కలిగించే విషయాలే. కాలచక్ర పరిభ్రమణ ప్రక్రియలో భాగంగా ఈ ప్రపంచం అనేక మలుపులు తిరిగింది. అనేక మార్పులకు లోనై, నిరంతరం ఏదో ఒక కొత్తదనాన్ని తనలో ఇముడ్చుకుని, ముందుకు సాగుతున్నది. 'కొత్తొక వింత పాతొక రోత అన్న చందంగా ఈ భూతలంపై నివసిస్తున్న జనబాహుళ్యం కొంగ్రొత్త జీవన విధానాలను తమ నిత్య జీవితాలకు అన్వయించుకుంటున్నది. అయితే మనతో పాటు ఈభూగ్రహంపై నివసిస్తున్న ఇతరజీవరాశులుమాత్రం కేవలం ఆహారంకోసం మాత్రమే అన్వేషిస్తూ, యథావిధిగా జీవిస్తూ, గతిస్తున్నాయి. భూమండలంపై ఏర్పడుతున్న అనేక పరిణామాలను తట్టుకుని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన మార్పులుచేసుకుంటూ, అనేక అంటు వ్యాధులను ఎదుర్కొంటూ, ప్రకృతి విపత్తులను సైతం తట్టుకుంటూ జీవిస్తున్న కారణంగానే మానవజాతి ఈ భూగ్రహంపై తన అస్థిత్వాన్ని కొనసాగిస్తున్నది. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' ప్రభావంతో నేడు మనమంతా ఎంతో సౌకర్యవంతంగా జీవిస్తున్నాం. ఇలాంటి అనుకూల పరిస్థితులను కాదనుకుని, జంతువుల్లా జీవించాలనుకోవడం జంతు ప్రవృత్తిని అలవరచుకుని, మానవ నాగరికతకు, మానవ జీవన విధానంలోని విశిష్టతకు దూరంగా జరగాలనుకోవడం, కేవలం ఏదోలా జీవించడానికే మార్గాలను అన్వేషించడం దేనికి సంకేతం? కేవలం బ్రతకడానికే ప్రాధాన్యత నిచ్చే విపరీతమైన ధోరణులను అలవరచుకోవడం మానవ అస్థిత్వాన్నిప్రశ్నిస్తున్నాయి. వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతిని స్వార్థం కోసం వినియోగించడం, నేరపూరిత ప్రవర్తనతో ఇతరులను వంచించి, హింసించి, చంపడం, కేవలం తినడానికే బ్రతకడం, బ్రతకడానికి మోసాలు చేయడం జంతు ప్రవృత్తికి నిదర్శనం. ఇకనైనా ఈ ధోరణి మారాలి. పెరిగిన విజ్ఞానం మెరుగైన జీవితాలకు సోపానం కావాలి. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' వినియోగం మనతోపాటు మనతో మమేకమై జీవిస్తున్న ఇతర జీవరాశుల మనుగడకు ప్రమాదకరంగా పరిణమించకూడదు. ప్రస్తుత వైజ్ఞానిక ఆవిష్కరణలు మనిషిని మృత్యుంజయుడిగా మారుస్తాయో, మృత్యువుకు ఎరగా వేస్తాయో కాలమే సమాధానం చెప్పాలి. ●

# క'ర్నాటకం'లో కొత్త సమీకరణాలు!

## దళిత సీనియర్ నేతకు సీఎం పదవి?

### మరోసారి ఢిల్లీకి డికెవర్గం



**బెంగళూరు, నవంబరు 22:** కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం జరుగుతున్న అంతర్గత పోరు మరింత ముదిరింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎవరికివారు మంకుపట్టుతో ఉంటే సీనియర్ దళిత ఎమ్మెల్యేను సీఎం చేయాలని ప్రతిపాదించారు. ఈరేసులో మొట్టమొదటగా వచ్చేది కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర రేసులో ముందుంటారు. తాజాగా డీకే శివకుమార్ వర్గం ఢిల్లీలో పాగా వేయగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గం బెంగళూరులో ప్రతివ్యూహాలకు పదును పెడుతోంది. సీఎం పదవి మార్పు కోసం ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా, డీకే శివకుమార్ మద్దతుదారులుగా ఉన్న 10 మందికి పైగా ఎమ్మెల్యేలు గత రెండు రోజులుగా ఢిల్లీలో మకాం వేశారు. త్వరలోనే మరో ఎమ్మెల్యేల బృందం కూడా ఢిల్లీకి బయలుదేరనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో అప్రమత్తమైన సిద్ధరామయ్య వర్గం, డీకే దూకుడుకు కళ్లెం వేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో భేటీ అయిన సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలో మరో ఇద్దరు డిప్యూటీ సీఎంలను నియమించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఇది డీకే శివకుమార్ ప్రాబల్యాన్ని తగ్గించే ఎత్తుగడగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, బెంగళూరులో సిద్ధరామయ్యకు విధేయులైన సీనియర్ మంత్రులు కేఎన్ రాజన్న, వెంకటేశ్, డాక్టర్ జి.పరమేశ్వర, హెచ్‌సీ మహదేవప్ప తదితరులు మంత్రి సతీశ్ జార్కిహోళి నివాసంలో విందు సమావేశం నిర్వహించడం తీవ్ర చర్చనీయాంశమైంది. డీకే వర్గం ఢిల్లీలో చేస్తున్న ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రులు నిర్ణయించారు. ఒకవేళ అధిష్ఠానం అధికార మార్పిడి వైపు మొగ్గుచూపితే, ముఖ్యమంత్రి పదవి డీకే శివకుమార్‌కు కాకుండా దళిత నేతకు ఇవ్వాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో దళిత నేతలు కూడా ప్రత్యేకంగా సమావేశం కావడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. మొత్తం మీద, విందు రాజకీయాలు, వర్గ సమీకరణాలతో కర్ణాటక కాంగ్రెస్‌లో పోరు తీవ్రస్థాయికి చేరింది. ప్రస్తుతం రెండు వర్గాలు అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నాయి. రాబోయే కొన్ని రోజులు కర్ణాటక రాజకీయాలకు అత్యంత కీలకం కానున్నాయి.



# ట్రంప్ శాంతిప్రతిపాదనకు పుతిన్ అంగీకారం

**మాస్కో, నవంబరు 22:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 28అంశాల శాంతి ప్రణాళికకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. 2022 నుంచి కొనసాగుతున్న ఈ భీకర యుద్ధానికి ఒక తుది పరిష్కారం కనుగొనడానికి ఈ ప్రణాళికను ప్రాతిపదికగా తీసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ టివిలో చేసిన ప్రసంగంలో పుతిన్ ఈ విషయం వెల్లడించారు. అమెరికా నుంచి తమకు ప్రతిపాదన అందిన విషయాన్ని ధ్రువీకరించారు. తుది శాంతియుత పరిష్కారానికి దీనిని ఆధారంగా ఉపయోగించుకోవచ్చని నేను నమ్ముతున్నానని పుతిన్ పేర్కొన్నారు. అలాస్కాలోని యాంకరేజ్‌లో జరిగిన చర్చల సందర్భంగా అమెరికా వైపు నుంచి కొన్ని సర్దుబాట్లు, సౌలభ్యం చూపాలని కోరినట్లు పుతిన్ తెలిపారు. కొన్ని క్లిష్టమైన సమస్యలు ఉన్నప్పటికీ రష్యా ఈ ప్రతిపాదనకు అంగీకరించిందని ఆయన వివరించారు. అదే సమయంలో ఈ ప్రతిపాదనను ఉక్రెయిన్ తిరస్కరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పుతిన్ హెచ్చరించారు. ఒకవేళ కీవ్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తే గతంలో కుపియాన్స్క్‌లో జరిగిన పరిణామాలే యుద్ధరంగంలోని ఇతర కీలక ప్రాంతాల్లోనూ పునరావృతం అవుతాయి. మొత్తం మీద ఈ పరిస్థితి మాకు ఆమోదయోగ్యమేనని ఆయన స్పష్టం చేశారు. మరో వైపు, ఈ శాంతి ప్రణాళిక రష్యా డిమాండ్లకు అనుకూలంగా ఉందని భావిస్తున్న ఉక్రెయిన్ తీవ్ర సందిగ్ధంలో పడింది.

దీనిపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ ఇప్పుడు ఉక్రెయిన్ ముందు చాలా కఠినమైన ఎంపిక ఉంది. ఆత్మగౌరవాన్ని వదులుకోవడమా? లేక ఒక ప్రధాన భాగస్వామి మద్దతును కోల్పోవడమా? అనేది తేల్చుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, నిజమైన, గౌరవప్రదమైన శాంతిని అందించే ప్రణాళిక కోసం తాము ఎదురుచూస్తున్నామని, ట్రంప్ బృందం ప్రయత్నాలను గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శాంతి ప్రణాళికను అంగీకరించేందుకు ఉక్రెయిన్‌కు వచ్చే గురువారం వరకు ట్రంప్ గడువు విధించారు.

# 'ఓట్ చోరీ'పై కాంగ్రెస్ భారీ ర్యాలీ

## వచ్చే 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో నిర్వహణ



**న్యూఢిల్లీ, నవంబరు 22:** ఎన్నికలు ఏవైనా ఓట్ల చోరీతోనే బిజెపి అధికారంలోకి వస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహసిస్తోందని కొద్దికాలంగా ఎడతెగని విమర్శలు కురిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ తన వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబరు 14న భారీ ర్యాలీ నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణను ఈ సభలో హైలైట్ చేయనుంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీలో పాల్గొంటారు. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారతదేశ ప్రజాస్వామ్యాన్ని విడిపించేందుకు జరుపుతున్న పోరాటానికి ఇది ఆరంభమని కాంగ్రెస్ చెబుతోంది. కాంగ్రెస్ 'మహా ర్యాలీ' వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ వివరిస్తూ, వచ్చే నెల 14వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రస్తుత తరుణంలో ప్రజాస్వామ్యాన్ని కమ్మేస్తున్న అతిపెద్ద ప్రమాదం ఓట్ చోరీ అని, దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రామ్‌లీలా నుంచి గట్టి సందేశాన్ని ప్రజల్లోకి పంపుతామని తెలిపారు.

'బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, పెద్ద ఎత్తున ఎన్నికల జాబితాల్లో అవకతవకలకు పాల్పడటం వంటి దుష్ట పన్నాగాలకు బిజెపి-ఇసిఐ పాల్పడుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కోట్లాది మంది సంతకాలు మాకు అందాయి. నిబంధనలను ఇసిఐ ఏ విధంగా తుంగలో తొక్కుతోందో, ఎంసిసి ఉల్లంఘనలను బేఖాతరు చేస్తోందో, పట్టపగలే డబ్బులు పంచుతూ బిజెపి రిగ్గింగ్‌కు పాల్పడుతుంటే ఏవిధంగా సహకరిస్తోందో ప్రజలందరికీ తెలుసు' అని కెసి వేణుగోపాల్ విమర్శించారు.

నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యవస్థను కళ్ల ముందే ధ్వంసం చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోలేమని చెప్పారు. బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత జరిపిన సమీక్షా సమావేశంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాలనే నిర్ణయం కాంగ్రెస్ పార్టీ తీసుకుందన్నారు. బీహార్ ఫలితాలకు ఓట్ చోరీనే కారణమన్నారు. ఇందుకు ప్రధాని, హోంమంత్రి, ఎన్నికల కమిషన్ కలిసి భారీ వ్యూహం పన్నాయని ఆరోపించారు.

కాగా, ఓట్ చోరీపై రాహుల్‌గాంధీ గత ఆగస్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానంతరం కాంగ్రెస్ పార్టీ సెప్టెంబరు నుంచి సంతకాల ఉద్యమం ప్రారంభించింది. కర్ణాటక కాంగ్రెస్ 1.12 కోట్ల సంతకాలు సేకరించగా, పంజాబ్ యూనిట్ 27 లక్షల సంతకాలను సేకరించి పార్టీ అధిష్ఠానానికి అందజేసింది. ఇతర రాష్ట్రాల్లో సైతం కాంగ్రెస్ విభాగాలు సంతకాల సేకరణ జరిపాయి.

# నోబెల్‌పురస్కారం అందుకోవాలన్నా అన్నీ సమస్యలే..



**కారకాస్, నవంబరు 22:** వెనెజులా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక బహుమతి నోబెల్ శాంతి పురస్కారం వరించిన సంగతి తెలిసిందే. ఈ పురస్కారాన్ని అందుకోవడంలో మరియా కొత్త చిక్కులను ఎదుర్కొంటున్నారు. నోబెల్ పురస్కారాలను డిసెంబర్ 10న నార్వేలోని ఓస్లోలో ప్రధానం చేయనున్నారు. ఈ వేడుకకు హాజరయ్యే విషయంలో మరియాకు ఇబ్బందులు తప్పడంలేదు. వెనెజులా ప్రభుత్వ ఆంక్షల కారణంగా ప్రస్తుతం ఆమె అజ్ఞాతంలో ఉన్నారు. నోబెల్ అందుకోవడానికి నార్వేకు వెళితే మరియాను పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని తాజాగా వెనెజువెలా అటార్నీ జనరల్ ప్రకటించారు. దేశాధ్యక్షుడిపై ప్రజల్లో విద్వేషాన్ని ప్రేరేపించడం, ప్రభుత్వంపై కుట్ర, ఉగ్రవాదం సహా పలు ఆరోపణలు మరియాపై ఉన్నాయి.

# జి20 సమ్మిట్‌లో ప్రధాని మోడీ, ఇటలీ ప్రధాని మెలోనీ



**న్యూఢిల్లీ, నవంబరు 22:** భారత్, ఇటలీ ప్రధానులు నరేంద్రమోడీ, జార్జియా మెలోనీ మంచి స్నేహితులు. అంతర్జాతీయ వేదికలపై వారిద్దరూ కలుసుకొన్నప్పుడు ఒకరినొకరు ఆత్మీకంగా పలకరించుకుంటుంటారు. ఆయా సందర్భాలకు సంబంధించిన దృశ్యాలు మెలోనీ పేరుతో వైరల్ అవుతుంటాయి. దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్‌బర్గ్‌లో శనివారం జరిగిన జి20 దేశాల 20వ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అధినేతలు హాజరయ్యారు. సమావేశంలో పాల్గొనడానికి ముందు మోడీ, మెలోనీ ఎదురుపడడంతో వారు చిరునవ్వులు చిందిస్తూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. 2023 డిసెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వేదికగా జరిగిన 'కాప్28' సదస్సు సందర్భంగా మొదటిసారి మోడీ, మెలోనీ సెల్ఫీ వైరల్ అయింది. మోడీతో తీసుకున్న స్వీయ చిత్రాన్ని మెలోనీ ఎక్స్‌లో షేర్ చేశారు. సదస్సుకు ముందు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా చేతులు జోడించి మోడీకి నమస్కరిస్తూ స్వాగతం పలికారు. జి7 సదస్సులో భాగంగా ప్రధాని మోడీ వరుస ద్వైపాక్షిక భేటీలతో బిజిబిజీగా గడిపారు. చైనా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా సహా పలు దేశాల అధినేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. మోడీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో రక్షణ, అణుఇంధనం సహా పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.



# దుబాయ్ ఎయిర్‌షోలో వింగ్‌కమాండర్ మృతి

## ఘటన చూస్తూ హతాశుడైన అతని తండ్రి!

**న్యూఢిల్లీ, నవంబరు 22:** భారత వైమానిక దళానికి చెందిన తేజస్ యుద్ధవిమానం దుబాయ్ ఎయిర్‌షోలో కూలిపోవడంతో వింగ్‌కమాండర్ నమాంశ్ స్యాల్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కుమారుడు పాల్గొన్న ఎయిర్‌షో వీడియోలను నమాంశ్ తండ్రి ఆసక్తిగా చూస్తోన్న సమయంలో ఈ షాకింగ్ ఘటన జరిగింది. ఆ దృశ్యాల ద్వారానే కుమారుడి మరణవార్తను తెలుసుకుని ఆ తండ్రి హతాశులయ్యారు. నమాంశ్ తండ్రి జగన్నాథ్ స్యాల్ హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. నమాంశ్ దుబాయ్ ఎయిర్‌షోలో తేజస్ యుద్ధవిమానాన్ని నడుపుతుండటంతో ఆ దృశ్యాలను యూట్యూబ్‌లో చూస్తున్నారు. అప్పుడే విమానం కుప్పకూలిపోవడం ఆయన కంటపడింది. దాంతో వెంటనే తన కోడలికి ఫోన్ చేశారు. ఆమె కూడా వైమానిక దళంలో వింగ్ కమాండర్‌గా ఉన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కొందరు అధికారులు జగన్నాథ్ ఇంటికి వచ్చారు. దాంతో తన కుమారుడికి ఏదో చెడు జరిగిందని ఆయన మనసు కీడు శంకించింది. కానీ అప్పటికే అంతా జరిగిపోయిందని ఆయన కన్నీరుమున్నీరయ్యారు. కుమారుడి మృతదేహం భారత్‌కు ఎప్పుడు తీసుకువస్తారనే దానిపై ఆ అధికారులు స్పష్టత ఇవ్వలేదని, అక్కడ అధికారిక ప్రక్రియలు పూర్తిచేసేందుకు రెండు రోజుల సమయం పట్టవచ్చని ఆయన విలపించారు. ఎయిర్‌షోలో తన విన్యాసాలను టివి, యూట్యూబ్‌లో చూడమని వెళ్లేముందు నమాంశ్ చెప్పాడని గుర్తుచేసుకున్నారు. నమాంశ్ తెలివైనవాడు. తన ఆలోచనలు ఎప్పుడూ గొప్పగా ఉండేవి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, సైనిక్ స్కూల్‌లో చదువుకున్నాడు. 2009లో ఎన్‌డిఎ పరీక్షలను క్లియర్‌చేసి విధుల్లో చేరాడు. నమాంశ్ భార్య ప్రస్తుతం కోల్‌కతాలో శిక్షణ పొందుతున్నారు. దుబాయ్ ఎయిర్‌షోలో నేల నుంచి తక్కువ ఎత్తులో విన్యాసాలు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

# పాక్‌లో మనీలాండరింగ్ అవినీతి ఎక్కువే..

## ఐఎంఎఫ్ సంచలన నివేదిక విడుదల



**కరాచి, నవంబరు 22:** పాకిస్థాన్‌లో అవినీతి సంబంధిత మనీ లాండరింగ్ ప్రమాదం అత్యంత తీవ్ర స్థాయిలో ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. దేశంలో జవాబుదారీతనం బలహీనంగా ఉండటం, దర్యాప్తు సంస్థల పనిలో తరచూ రాజకీయ జోక్యం జరగడమే ఈ దుస్థితికి ప్రధాన కారణాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ నవంబర్ 19న విడుదల చేసిన గవర్నెన్స్ అండ్ కరప్షన్ డయాగ్నస్టిక్ నివేదికలో ఐఎంఎఫ్ వెల్లడించింది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, ప్రభుత్వ కొనుగోళ్లు వంటివి మనీ లాండరింగ్‌కు అత్యంత ప్రమాదకర రంగాలుగా ఉన్నాయి. ముఖ్యంగా రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులతో ముడిపడిన కార్యకలాపాల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని తెలిపింది. డొల్ల కంపెనీలు, కార్పొరేట్ వ్యవస్థల దుర్వినియోగం, అనధికారిక నగదు బదిలీ మార్గాల ద్వారా అవినీతి సొమ్మును దాస్తున్నారని వివరించింది. న్యాయవ్యవస్థలో జాప్యం, సుదీర్ఘ విచారణలు, తక్కువ శిక్షల రేటు వల్ల మనీ లాండరింగ్ నిరోధక చట్టాల అమలు నీరుగారిపోతోందని అభిప్రాయపడింది. అయితే, దేశంలో మారుతున్న పరిస్థితులను కూడా ఐఎంఎఫ్ ప్రస్తావించింది. పాక్ జనాభాలో 60 శాతానికి పైగా 30 ఏళ్లలోపు యువతే ఉండటం, వారు అవినీతిని ఏమాత్రం సహించకపోవడంతో జవాబుదారీతనం కోసం డిమాండ్ పెరుగుతోందని పేర్కొంది. ఈ ఒత్తిడి కారణంగా రాజకీయ నాయకులు కూడా అవినీతిని అరికట్టాల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నారని తెలిపింది. పాకిస్థాన్‌లోని నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో వంటి దర్యాప్తు సంస్థల పనితీరులో తీవ్ర లోపాలు ఉన్నాయని ఐఎంఎఫ్ ఎత్తిచూపింది. అవినీతి ఫిర్యాదులపై అధికారిక విచారణ ప్రారంభించడానికే సుమారు నాలుగు నెలల సమయం పడుతోందని, చాలా ఫిర్యాదులు మధ్యలోనే ఆగిపోతున్నాయని తెలిపింది. 2023-24లో 17 బ్యాంకులపై రూ.944 మిలియన్ల జరిమానాలు విధించినప్పటికీ, రాజకీయ సంబంధాలున్న కేసుల్లో దర్యాప్తు పక్షపాతంగా జరుగుతోందనే ఆందోళనలు ఉన్నాయని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయ లోపం, పారదర్శకత లేకపోవడం వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొంది.

# సంక్షిప్తంగా..


## అణుదాడిని తట్టుకునే ఫ్లోటింగ్ ఐలాండ్ నిర్మిస్తున్న చైనా



**బీజింగ్, నవంబరు 22:** అణ్వస్త్ర దాడిని తట్టుకుని నిలిచే తేలియాడే కృత్రిమ దీవిని చైనా నిర్మిస్తున్నట్లు తెలుస్తున్నది. దీనిని మెగా సైన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అని చైనా ప్రభుత్వ పరిశోధకులు చెపుతున్నారు. ఈ 78,000 టన్నుల బరువైన సెమీ సబ్‌మెర్సిబుల్ ట్విన్ హాల్ ప్లాట్‌ఫామ్ ప్రపంచంలో మొదటి సంచార, స్వయం సమృద్ధ కృత్రిమ దీవి. ఈ ప్రాజెక్టు సారథి, అకడమీషియన్ లిన్ ఝోంగ్‌కిన్ మాట్లాడుతూ, 2028 నాటికి ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాలంతో పరుగులు పెడుతున్నామన్నారు. దీనిలో 238 మంది 4 నెలలపాటు బస చేయగలరు. విధ్వంసకరమైన ప్రకంపణలను తట్టుకునేలా మెటా మెటీరియల్ శాండ్‌విచ్ ప్యానెల్స్‌తో దీనిని రూపొందిస్తారు. దీనిలో అత్యవసర విద్యుత్, కమ్యూనికేషన్స్, నేవిగేషన్ కంట్రోల్ వంటివి ఉంటాయి.

# కాలేయ మార్పిడిలో ప్రపంచానికి భారత్ మార్గదర్శి

## కాలేయమార్పిడి సొసైటీ వార్షిక సదస్సులో వైద్యనిపుణులు



**న్యూఢిల్లీ, నవంబరు 22:** కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్రచికిత్సల్లో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని వైద్య నిపుణులు ప్రశంసించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యంత నైపుణ్యం కలిగిన సర్జన్లు, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థల వల్లే ఇది సాధ్యమైందని వారు స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలో ప్రారంభమైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సులో నిపుణులు ఈ అభిప్రాయాలను పంచుకున్నారు. గ్లోబల్ అబ్జర్వేటరీ ఆన్ ఆర్గాన్ డొనేషన్ అండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ , నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం 2024లో భారతదేశంలో సుమారు 5,000 కాలేయ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200కు పైగా క్రియాశీల లివర్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ సందర్భంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కాబోయే అధ్యక్షుడు డాక్టర్ అభిదీప్ చౌదరి మాట్లాడుతూ భారత్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ వ్యవస్థ అనేది విజ్ఞానం, నైతికత, మానవత్వం మధ్య సంపూర్ణ సమన్వయాన్ని సూచిస్తుంది. ఇక్కడి ప్రతి విజయం వెనుక కఠినమైన ప్రోటోకాల్స్, పారదర్శక దాతల ఎంపిక విధానం, వైద్యుల నిబద్ధత ఉన్నాయి. కేవలం సంఖ్యలోనే కాకుండా కరుణ, జవాబుదారీతనం వంటి విలువలతో కూడిన ప్రక్రియ భారత్‌ను ప్రత్యేకంగా నిలుపుతోందని వివరించారు. ప్రపంచంలోనే జీవించి ఉన్న దాతల నుంచి కాలేయ మార్పిడి సర్జరీలు అత్యధికంగా చేసే దేశం భారత్ అని నిపుణులు తెలిపారు. ఇక్కడ దాత, గ్రహీత ఇద్దరి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, పారదర్శకమైన, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తున్నారు. దాతలు సాధారణంగా దగ్గరి బంధువులే ఉంటారు. ప్రతి కేసును వైద్య, మానసిక, నైతిక కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తారు. ఈ కఠిన నిబంధనల వల్లే అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా, కొన్నిసార్లు వారికంటే మెరుగైన సక్సెస్ రేటును భారత్ సాధిస్తోంది. ఇంటర్నేషనల్ లివింగ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మొహమ్మద్ రెలా మాట్లాడుతూ భారత ఎల్‌డీఎల్‌టీ నమూనా ప్రపంచానికే ఒక బంగారు ప్రమాణంగా నిలిచింది. మా అనుభవాలను పంచుకోవడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను అందరికీ సురక్షితంగా, అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. రేపటి వరకు జరగనున్న ఈ సదస్సుకు 20కి పైగా దేశాల నుంచి వెయ్యి మందికి పైగా నిపుణులు, పరిశోధకులు హాజరయ్యారు.

# జీన్స్‌తో వచ్చి ప్రమాణ స్వీకారం చేసిన యువ మంత్రి



**పాట్నా, నవంబరు 22:** బీహార్ ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రుల ప్రమాణస్వీకారోత్సవంలో ఒక యువమంత్రి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఉన్నత విద్యావంతుడయిన దీపక్‌ప్రకాష్ క్యాజువల్ జీన్స్, షర్ట్‌లో వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి మంత్రిగా ప్రమాణం చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కూడా చేయని ఈ యువకుడు ఎవరంటూ సోషల్ మీడియాలో ఒక్కసారిగా చర్చ మొదలైంది. ఆ ఎమ్మెల్యే పేరు దీపక్ ప్రకాశ్ (36). ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) అధినేత, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ్ కుమారుడే ఈయన. దీపక్ తల్లి స్నేహలతా కుష్వాహ్ ససారం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆర్‌ఎల్‌ఎం పార్టీకి కేటాయించిన ఏకైక మంత్రి పదవిని, ఎమ్మెల్యేగా గెలిచిన తన తల్లికి బదులుగా దీపక్ దక్కించుకోవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

# హిందూ సమాజం లేకుంటే ప్రపంచమే ఉనికి కోల్పోతుంది..

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్

**ఇంఫాల్, నవంబరు 22:** ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకపాత్ర పోషిస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని,



యునాన్ (గ్రీస్) మిస్ర్ (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కు చెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా ముఖ్యమనిమోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు.ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదన్నారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రంసహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు.

# అయ్యప్ప దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు

## టికెట్ల జారీలో ఆంక్షలపై భక్తుల్లో నిరసన వెల్లువ




**పతనంతిట్ట(కేరళ), నవంబరు 22:** మండల మకరు విళక్కు పూజల కోసం తెరిచిన శబరిమల అయ్యప్ప స్వామి దర్శనాల కోసం భక్తులు పోటెత్తారు. దీంతో సన్నిధానం నుంచి పంబ వరకూ క్యూలైన్ నిలిచిపోయింది. సౌకర్యాలు కూడా అంతంతమాత్రంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై కేరళ హైకోర్టు జోక్యం చేసుకోవడంతో అధికారులు చర్యలు చేపట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. స్పాట్ బుకింగ్ టిక్కెట్ల కోటాను 5 వేలకు తగ్గించడం సహా పలు ఆంక్షలు విధించారు. అలాగే, నిలక్కల్, వండిపెరియార్ వద్ద మాత్రమే స్పాట్ బుకింగ్ టిక్కెట్లను జారీచేస్తున్నారు. పంపా, ఎరుమేలి, చెంగనూరు లోని బుకింగ్ సెంటర్లను తాత్కాలికంగా నిలిపివేశారు. వర్చువల్ క్యూ దర్శనం టిక్కెట్లను ఆన్‌లైన్‌లో భక్తులు బుక్ చేసుకోవాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు విజ్ఞప్తి చేసింది. శబరిమలలో పరిస్థితులు, టీడీబీ చేపట్టిన చర్యలపై కేరళ హైకోర్టు తీవ్ర విమర్శలు గుప్పించింది. నవంబరు 17 నుంచి శబరిమలలో దర్శనాలకు అనుమతించగా.. 48 గంటల్లోనే 2 లక్షల మంది భక్తులు తరలివచ్చారు. దీంతో భక్తులను నియంత్రించలేక అధికారులు చేతులెత్తేశారు. క్యూలైన్‌లో ఓ మహిళా భక్తురాలు చనిపోయిన సంగతి తెలిసిందే. నిలక్కల్‌లో అర్ధరాత్రి తర్వాత స్పాట్ బుకింగ్‌లు నిలిపివేయడంతో భక్తులు నిరసనకు దిగారు. ఆకస్మిక ఆంక్షలతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు గందరగోళానికి గురయ్యారు. స్పాట్ బుకింగ్‌లపై కేరళ హైకోర్టు ఆంక్షల గురించి తెలియక నిలక్కల్, పంపా వద్ద భారీగా భక్తులు బారులు తీరారు. బుకింగ్ మొదలైన కొద్ది సమయంలో టోకెన్ల కోటా పూర్తికావడంతో టిక్కెట్ దొరక్క వందల మంది నిరాశకు గురయ్యారు. శబరిమల వెళ్లేందుకు అనుమతించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు కొత్త నిబంధనల గురించి వివరించేందుకు సిబ్బంది నానా తంటాలు పడ్డారు. శబరిమల ఏడీఎం అరుణ్ ఎస్ నాయర్ మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందన్నారు.

# ఢిల్లీ పేలుడు కేసులో కాశ్మీర్‌నుంచి మరొకరి అరెస్టు



**న్యూఢిల్లీ, నవంబరు 22:** ఢిల్లీ ఎర్రకోటవద్ద జరిగిన కారుబాంబు పేలుడుకేసులో జమ్ముకాశ్మీర్ దర్యాప్తుసంస్థ ఎస్ఐఎ, ఎస్ఒజి శనివారం మరొకరిని అరెస్టుచేసింది. పుల్వామా నివాసి అయిన తుఫైల్ అహ్మద్‌ను దర్యాప్తుదళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఒక పారిశ్రామిక ఎస్టేట్‌లో పని చేసే ఎలక్ట్రీషియన్ అయిన తుఫైల్‌ను ప్రస్తుతం పోలీసులు ఇంటరాగేషన్ చేస్తున్నారు. తుఫైల పాత్ర గతంలో తాము విశ్వసించిన స్థాయికంటే విస్తృతంగా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని దర్యాప్తు బృందాలు పేర్కొంటున్నాయి. తుఫైల్‌కు ఉన్న సంబంధాలు, ఢిల్లీ కారుబాంబుదాడిలో పాత్ర ఎంతమేరకుందన్న అంశంపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ మొత్తం కుట్రలో భాగం ఉన్న అందరినీ ఛేదించాలనే ఈ దర్యాప్తుసాగుతున్నది.

# రెండేళ్లక్రితమే ఉగ్ర కుట్రలకు బీజం..



**న్యూఢిల్లీ, నవంబరు 22:** దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కేసుకు సంబంధించి దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది కేవలం ఒక్క నగరానికి పరిమితమైన దాడి కాదని, దేశవ్యాప్తంగా పలు నగరాల్లో సిరియల్ పేలుళ్లకు జైషే మహ్మద్‌తో సంబంధమున్న ఓ వైట్ కాలర్ ఉగ్రవాద ముఠా భారీ కుట్ర పన్నినట్లు తేలింది. ఈ కుట్రకు 2023లోనే బీజం పడిందని నిందితుల్లో ఒకరు విచారణలో అంగీకరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నెల 10న ఎర్రకోట సమీపంలో ఓ కారులో జరిగిన పేలుడులో 13 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే, ఇది ఉగ్రవాదులు భయంతో ముందుగానే పేల్చేయడం వల్ల జరిగిందని, అసలు ప్రణాళిక మరింత పెద్దదని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మాహుతి బాంబర్ ఉమర్ మహ్మద్ సహచరుడైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారించగా కీలక వివరాలు వెల్లడయ్యాయి.

# 24 నుంచి రైతన్న.. మీ కోసం వారోత్సవాలు

భీమవరం నవంబర్ 22(ప్రభాతవార్త: ఈనెల 24 నుండి 29వ తేదీ వరకు నిర్వహించే "రైతన్న.. మీకోసం" వారోత్సవాలను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని,సాగును లాభసాటిగా మార్చడం, రైతులను వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పుల వైపుకు నడిపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని,రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి రైతు కుటుంబాలకు అవగాహన కల్పించాని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ కాల్ నుండి "రైతన్న....మీకోసం" వారోత్సవాల నిర్వహణ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లాలోని ఆర్డీవోలు, వ్యవసాయ, ఉద్యాన, పశు, మత్స్యశాఖ అధికారులు, తహసిల్దార్లు, ఎంఏవోలు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.




# ఒక్క ఫిర్యాదు వచ్చిన చర్యలు తప్పవు

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.

## రోగులకు సిబ్బంది అందించే సేవలపై వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించాలి

## వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



ఏలూరు, నవంబరు 22: ప్రభాతవార్త : జిల్లా కలెక్టరేటు జిల్లా కలెక్టరు ఛాంబర్లో శనివారం ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్, మెడికల్ కాలేజీలో ఉన్న సమస్యలు, ప్రధాన ప్రభుత్వ హాస్పిటల్లో ఇటీవల వచ్చిన ఫిర్యాదులుపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని, తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని, హాస్పటల్ కి వచ్చిన ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్లు పట్ల స్నేహపూర్వక వాతావరణంలో వైద్యసేవలు అందించాలని అన్నారు. వారికి వైద్యం అందించుటలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి వార్డు, ప్రతి వైద్య విభాగంను ఎప్పటికప్పుడు తనిఖీలు చెయ్యాలని, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకోవాలని అన్నారు. అన్ని సీసీ కెమెరాలు సీసీ ఫుటేజీని పరిశీలించి లోటుపాట్లు ఉంటే తక్షణం చర్యలు తీసుకోవాలని, ఉదాసీనత ప్రదర్శిస్తే సమస్యలు జఠిలం అవుతాయని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.జె. అమృతం, డిసిహెచ్ యస్ డా. బి.పాల్ సతీష్ కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. పి.సావిత్రి, జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెంటు డా.యం.యస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి - జిల్లా కలెక్టర్



పాలకొల్లు, నవంబర్ 22,ప్రభాత వార్త: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రధాన బాధ్యతగా వైద్యాధికారులు గుర్తించుకోవాలని, అదే ఆరోగ్య భద్రతకు బలం అవుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం ఆమె పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రిని ఎలాంటి సూచన లేకుండా ఆకస్మికంగా సందర్శించడంతో ఆసుపత్రి వాతావరణం ఒక్కసారిగా కదిలిపోయింది. ఆసుపత్రి లోని ప్రసూతి వార్డు, పురుషుల వార్డులను తనిఖీ చేస్తూ రోగులుతో నేరుగా మాట్లాడిన ఆమె, ప్రతి రోగి పరిస్థితిని శ్రద్ధగా తెలుసుకున్నారు. పిల్లల మధ్య జరిగిన కొట్లాటలో గాయపడిన తత్తరమూడి మనోజ్‌ను ఆదుర్దాగా పలకరించి వివరాలు తెలుసుకున్నారు. మద్యం అలవాటు నుంచి బయటపడాలని పురుషుల వార్డులో ఉన్న ఓ రోగికి మానసిక ధైర్యం చెప్పి హితవు అందించారు. కుటుంబ కలహాల కారణంగా ఆసుపత్రిలో చేరిన మరో రోగిని ఓదార్చుతూ– "ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోకండి విశ్వాసం, భరోసా ఉంటే కోలుకోవడం త్వరగా జరుగుతుందని ప్రోత్సహించారు. ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న మహిళలతో ఆరోగ్య పరిస్థితులు, వైద్య సేవలపై అవగాహన పొందుతూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వివరంగా అడిగారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్త ఆసుపత్రి భవనంలో ప్రతి విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎక్కడైనా లీకేజీలు లేదా నిర్మాణ లోపాలున్నాయా అన్న విషయాన్ని స్వయంగా చెక్ చేశారు. సిబ్బంది బలం, వైద్యుల కొరత, నెలలో జరిగే ప్రసవాల సంఖ్య వంటి విషయాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ప్రశ్నించి వివరాలు సేకరించారు. కలెక్టర్ పర్యటనలో డి.సి.హెచ్.ఎస్ పి. సూర్యనారాయణ, హాస్పిటల్ సూపరింటెండెంట్ మాధురి, ఆర్ఎంఓ జనార్దన్ బాబు, తహసిల్దార్ వై. దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి సహా పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పెనుగొండ స్టేషన్‌లో కేసుల పరిశీలన

## -ప్రజా భద్రతపై ప్రత్యేక శ్రద్ధ: డీ.ఎస్.పి డాక్టర్ శ్రీవేద:



పెనుగొండ, నవంబర్ 22 ప్రభాతవార్త: పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం సబ్‌డివిజన్ డి.ఎస్.పి డాక్టర్ వేద పెనుగొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఉదయం స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ గారిని ఎస్సై గంగాధర్ సహా పోలీసు సిబ్బంది ఆప్యాయంగా స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రిజిస్టర్లు, రికార్డులు, కేసు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు.కేసుల దర్యాప్తు పురోగతి పైన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన డీఎస్పీ పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తిచేయాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో తడబడొద్దని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కేసుల నమోదు తర్వాత ప్రారంభ దర్యాప్తు నుంచి ఛార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతిదీ సమయపాలనతో చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ట్రాఫిక్ అమలు చర్యలను మరింత పటిష్టం చేయాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వంటి భద్రతా నిబంధనలు తప్పనిసరి చేయాలని సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్‌స్పాట్లను గుర్తించి అక్కడ తగిన చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి సంఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా ఇటువంటి చర్యలపై సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.అపహరించబడిన ప్రాపర్టీ కేసుల వేగవంతమైన ఛేదన సమీప కాలంలో పెరిగిన ప్రాపర్టీ కేసులను వేగంగా ఛేదించి, సొత్తు రికవరీ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. ప్రజలలో విశ్వాసం పెరగాలంటే పోలీసులు వేగవంతమైన చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని తెలిపారు.సీసీ కెమెరాల పర్యవేక్షణను బలోపేతం పోలీస్ స్టేషన్ పరిధిలోని, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టం చేయాలని, వాటి మానిటరింగ్ కోసం స్టేషన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని డీఎస్పీ ఆదేశించారు. నేరాలు నిరోధించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి స్టేషన్‌ను ఆశ్రయించే ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని, వారి తో మాటవినడంలో, సాయం అందించడంలో మర్యాదపూర్వక వైఖరి ప్రదర్శించాలని డీఎస్పీ సిబ్బందికి సూచించారు. బాధితులను ఆలస్యం చేయకుండా, ప్రత్యేక శ్రద్ధతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాల్లో, పాఠశాలల్లో, పట్టణ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, హెల్ప్‌లైన్ సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.స్టేషన్‌లో ఉన్న వాహనాలు, ఇతర ప్రాపర్టీని ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచకుండా చట్టపరమైన విధానంలో డిస్పోజ్ చేయాలని డీఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి తో పాటు ఎస్సై గంగాధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా భద్రత, క్రమశిక్షణ, నేరాల నివారణలో పోలీసులు మరింత కృషి చేయాలని డి.ఎస్.పి స్పష్టం చేశారు.





# మహిళలకు శక్తివంతమైన యాప్.. శక్తి యాప్

ఏలూరు ప్రభాతవార్త :ఏలూరు జిల్లా ఎస్పి. ప్రతాప్ శివ కిషోర్ యొక్క ఆదేశాలపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ యు రవిచంద్ర శక్తి టీం సభ్యులు శక్తి యాప్ యొక్క ఉపయోగాలను గురించి సదస్సు ను శ్రీ ఆదిత్య కాలేజీ విద్యార్థుల కు అవగాహన నిర్వహించినారు శక్తి యాప్ ఒక మహిళా భద్రతకు సంబంధించిన అత్యవసర స్పందన మొబైల్ అప్లికేషన్. దీనిని ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అభివృద్ధి చేసింది. ఇది ముఖ్యంగా మహిళలు మరియు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించేందుకు రూపొందించబడింది అని, ఏది అయినా అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ను ఉపయోగించిన ఎడల లేదా డయల్ 112 కు సమాచారం అందించిన ఎడల. దీని ద్వారా సమీప శక్తి టీం గస్తీ బృందం తక్షణమే మీ వద్దకు చేరుకోగలదు. మహిళా రక్షణపై నమ్మకమైన సాధనం ఈ యాప్ ద్వారా మహిళలు రాత్రి పూట లేదా ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు భద్రత గా భావించవచ్చు. అవగాహన మరియు శక్తి యాప్ లో మహిళల హక్కులు, చట్టాలు, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ లు మొదలైన సమాచారం లభిస్తుంది. సైబర్ నేరాలు, హరాస్మెంట్ వంటి వాటి గురించి కూడా అవగాహన పొందవచ్చు. హెల్ప్ లైన్ నెంబర్ లను అందుబాటులో ఉన్నట్లు 112 – ఎమర్జెన్సీ నెంబర్ 181 – మహిళా హెల్ప్ లైన్ వంటి నెంబర్లను నేరుగా యాప్ నుండి కాల్ చేయవచ్చు. ఫ్రెండ్ ట్రాకింగ్ / సేఫ్టీ షేరింగ్. మీ స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో లైవ్ లొకేషన్ ను పంచుకోవచ్చు వారు మీ ప్రయాణాన్ని గమనించవచ్చు. శక్తి యాప్ ను ఉపయోగించ వలసిన సందర్భాలు వేధింపులు కిడ్నాప్ ప్రయత్నం గృహ హింస రహదారిలో ఒంటరిగా ప్రయాణం అనుమానాస్పద వ్యక్తుల ప్రవర్తన శక్తి యాప్ ఒక ఆత్మ విశ్వాసానికి కలిగి ఉంటాడదానికి నిదర్శనం, మహిళలు ఎక్కడ ఉన్నా సురక్షితంగా ఉండేందుకు పోలీస్ శాఖ తీసుకున్న అద్భుతమైన చర్య. ప్రతి మహిళా తమ ఫోన్ లో ఈ యాప్ తప్పనిసరిగా ఉంచుకోవాలి అని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గారు విద్యార్థులకు తెలియ చేసినారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ నాగమణి ఏలూరు 1 టౌన్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ శక్తి టీం సభ్యులు ఆదిత్య కాలేజీ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



# మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు

ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మండలము, గురవాయిగూడెం గ్రామము నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి దేవస్థానము నందు ఉదయం గం.08.00ల నుండి ఆలయ ముఖ మండపం నందు పంచామృతఅభిషేకం ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆద్వర్యములో జరుపబడినది. ఈ కార్యక్రమం నందు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనినారు. ఈ రోజు మద్యాహ్నం గం.05.30 లవరకు శ్రీ స్వామి వారి ఆలయమునకు వివిధ సేవల రూపేణా రూ1,79,830/–లు సమకూరినది. శ్రీ స్వామి వారికి స్వామి వారి నిత్యాన్నదాన సత్రం నందు సుమారు 2388 మంది భక్తులకు అన్నదానము జరుపబడినది. స్వామి వారి దర్శనమునకు విచ్చేసిన ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెల్పినారు.



# సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరం వద్ద గోదావరి పూజా మహోత్సవం





పెనుగొండ, నవంబర్ 22 (ప్రభాతవార్త): పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో పవిత్ర కార్తీక మాసం పూర్తయిన సందర్భంగా పోలి పాడ్యమి (పోలమ్మ స్వర్గం) పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాంప్రదాయబద్ధంగా గోదావరి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన సిద్ధాంతం వశిష్ట గోదావరి నది తీరం తెల్లవారుజామునే భక్తుల సందడి మొదలైంది. స్వామి వారు వేదఘోషాల నడుమ గోదావరికి ప్రత్యేక మహాపూజ నిర్వహించి, కార్తీక మాసానికిదే ముగింపు కావడంతో నదీ తీరమంతా ఆధ్యాత్మిక శోభ పరచింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని గోదావరి తల్లిని నమస్కరిస్తూ పవిత్ర స్నానాలు ఆచరించారు. పూజ అనంతరం స్వామి వారు భక్తులకు ఆశీర్వచనాలు అందిస్తూ, కార్తీకమాస పూజా నియమాల ప్రాముఖ్యతను వివరించారు. అంతట భక్తులతో కలిసి నదిలో దీపాలను ప్రవహించడం విశేషంగా నిలిచింది. శతాదిక దీపాలతో గోదావరి తీరమంతా వెలుగులతో మెరిసిపోగా అందరూ భక్తి భావంతో ఈ పుణ్యసందర్భాన్ని జరుపుకున్నారు. దీపాల రేవులో నది ప్రవాహం మధ్య తేలియాడిన వెలుగులు దర్శనానికి అలౌకికంగా కనిపించాయి. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు దేవాలయ సిబ్బంది, స్థానిక సేవా దళాలు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. భక్తులకు పల్లకీర్తన, హారతులు మరియు తీర్థప్రసాదం అందజేశారు. మొత్తం కార్యక్రమం శాంతసౌమ్య వాతావరణంలో అత్యంత భక్తి శ్రద్ధలతో సాగి, కార్తీక సమాప్తి పర్వదినం సిద్ధాంతంలో ఆధ్యాత్మికంగా చిరస్థాయిగా నిలిచింది.

# శ్రీ బాల వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు



మొగల్తూరు నవంబర్ 22 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవేను ఆనుకుని కొత్త గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బాల వెంకటేశ్వర స్వామి వారి ఆలయమునందు శనివారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన అఖండ అన్న సమారాధన స్వీకరించారు, కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దగ్గరుండి చూసుకున్నారు

# శిథిలా వ్యవస్థకు చేరుకున్న వంతెన

మొగల్తూరు నవంబర్ 22 (ప్రభాతవార్త) మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఉచింత కాలవపై నిర్మించిన వంతెన శిథిలా వ్యవస్థ గా మారడంతో శనివారం ప్రజలు మాట్లాడుతూ ఈ వంతెనపై ప్రయాణం చేయడానికి బయళంధనకు గురవుతున్నామని, ఎన్ని ప్రభుత్వాలు మారిన ఈ వంతెన మరమ్మతు పనులు ప్రారంభించడం లేదని, పరిసర ప్రాంతాలలో ఆక్వా సాగు చేయడంతో ఈ వంతెనపై భారీ వాహనాలు వెళ్లడంతో వంతెన శిథిలం గా మారిందని, దీనిని వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి వంతెన మరమత్తు పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు





యానం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొల్లు పెద్దిరాజు ప్రభాతవార్త నరసాపురం

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం నియోజవర్గంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను నియోజకవర్గ ఇన్చార్జి పి రామరాజు తీసుకున్నారు. త్వరగా వీటిని పరిష్కరిస్తామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొల్లు పెద్దిరాజు మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొప్పర్రు గ్రామంలో పుస్తక ప్రదర్శన



ప్రభాతవార్త నరసాపురం రూరల్ : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయమునకు అనుబంధంగా ఉన్న పుస్తక పంపిణీ కేంద్రం కొప్పర్రు లో గ్రంథాలయ కమిటీ గోపాలకృష్ణ గోకులే,పోలిశెట్టి రమేష్ వారి ఆధ్వర్యంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో కేజే ఎస్ ఎల్ కుమారీ గ్రేడ్ వన్ లైబ్రేరియన్ పాల్గొని గ్రంథాలయ వారోత్సవాల ప్రాధాన్యతను విశిష్టతను పిల్లలకు వివరించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది తదనంతరం ఎంపీపీ స్కూల్ కొప్పర్రు మెయిన్ లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన లో పాల్గొనడం జరిగింది ఉప్పు గంటి రాజశ్రీ ఈ పుస్తక ప్రదర్శన లో సాహిత్య అకాడమీ బహుమతి పొందిన రచనలు వంద ఏళ్ల తెలుగు కథ జాతీయ కథలు వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు 30 మంది రచయితల పుస్తకాలుపరిచయం మరియు జాతీయ నాయకులఫోటోలు ప్రదర్శన ను గురించి వివరించారు ఈ పుస్తక ప్రదర్శన పిల్లలకు ఎంతో. విజ్ఞాన దాయాకం గా ఉంది. పుస్తక పంపిణీ కేంద్రమునకు నర్సాపురం రీడర్స్ ఫారం వారు సాహిత్యా పుస్తకాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలోకొప్పర్రు పుస్తక పంపిణీ కేంద్రం నిర్వాహకులు కమల కుమారి,రీడర్స్ ఫారం సుధీర్ మోహన్ సాఫ్ట్ లైన్ కంప్యూటర్స్, సూర్యం బాబు డాక్టర్ ఆరేటి అమ్మాజీ, భట్టిప్రోలు సత్యనారాయణకొప్పరు గ్రామ పెద్దలు టీచర్లు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు .

# పదవతరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్రంలో......
## ఏలూరు నెంబర్ వన్ గా నిలవాలి




ఏలూరు, నవంబరు 22: ప్రభాతవార్త :స్థానిక జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో శనివారం పదవతరగతి స్టడీమెటీరియల్ విజయకేతనం 3.0 పుస్తక మహోత్సవంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ( చంటి) సంయుక్తంగా పాల్గొని, విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో నిరుపేద విద్యార్థులకు విద్యా ప్రమాణాలను మెరుగు పరచడం లక్ష్యంగా విజయకేతనం 3.0 పుస్తకాలు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా రూపొందించ పడ్డాయని తెలిపారు. గత సంవత్సరం ఈ పుస్తకాలు వలన పదవతరగతి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఈ సంవత్సరం కూడా అదే స్థాయిలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం జిల్లా పరిషత్తు నిధులతో 30,327 పుస్తకాలు పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిపుణులైన ఉపాధ్యాయులచే ప్రత్యేకంగా రూపొందించిన ఈ పుస్తకాలు విద్యార్థులకు ఉత్తమ సాధనంగా నిలుస్తాయని అన్నారు. ఈ పుస్తకాన్ని రూపొందించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. మనం రూపొందించిన విజయకేతనం స్టడీ మెటీరియల్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు తీసుకురావటానికి ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు సమిష్టిగా కృషి చెయ్యాలని సూచించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావిధానంలో అనేక మార్పులు తీసుకువచ్చారని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని అన్నారు. ఏకాగ్రతతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు పదవతరగతి ఉత్తీర్ణత ఎంతో కీలకమైనదని, తదుపరి తరగతులలో ప్రవేశించి మంచి భవిష్యత్తును పొందాలంటే ఎంతో ముఖ్యమన్నారు. ఏకాగ్రతతో చదివితే ఏది కష్టంకాదని, చదువుపై మనసును లగ్నం చేసుకునేలా మనసుకు క్రమశిక్షణ అవసరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాముల్లు, పౌష్టికాహారం, మౌలిక వసతులు అందిస్తుందని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ సమావేశంలో ఉడా చైర్ పర్సన్ పెద్దిబోయిన వాణి వెంకట శివప్రసాదు, ఏలూరు మండల పరిషత్తు అధ్యక్షులు పెన్మెత్స శ్రీనివాస రాజు, బిసి నాయకులు ఘంటా ప్రసాదరావు, జిల్లా పరిషత్తు సిఇవో యం.శ్రీహరి, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా పరిషత్తు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు హాజరయ్యారు.

# అర్హులైన అందరికీ ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు



భీమవరం నవంబర్ 22ప్రభాతవార్త :అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందరికీ ఇల్లు పథకంలో భాగంగా జిల్లాలోని అందరూ ఆర్డీవోలు, తాహసిల్దార్, డీటీలుతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత లేఅవుట్ లో ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించి వీఆర్వో లాగిన్ లో అప్డేట్ చేయాలని అన్నారు. గత రెండు రోజులుగా అప్డేట్ చేయవలసిన యాప్ ను ఇప్పటికీ జిల్లాలోనీ పెనుగొండ, పెనుమంట్ర, అత్తిలి, పోడూరు మండలాలు మాత్రమే డేటా ఎంట్రీని మొదలుపెట్టడం జరిగిందని అన్నారు .జిల్లాలో మిగతా మండలాలు సోమవారం లోగా డేటా ఎంట్రీ మొదలుపెట్టి పూర్తి చేయాలని అన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 1,453 ప్లాట్లను తనిఖీ చేసి గుర్తించడం జరిగిందన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారిలో 5,423 మంది దరఖాస్తులను అర్హులుగా గుర్తించడం జరిగిందని అన్నారు వారి అందరికీ త్వరగా ప్లాట్లు కేటాయించి ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 14,842 ప్లాట్లు ఆన్లైన్లో పట్ట దారుల పేర్లు నమోదు చేయలేదని అన్నారు. స్వయంగా లేఅవుట్లు పరిశీలించి పెండింగ్ ఉన్నవి ఆన్లైన్లో అప్డేట్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఈడీఎం కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# బల్బు వెలగాలంటే తీగ తొలిగాల్సిందేనా ?



వేలేరుపాడు, నవంబర్ 22, ప్రభాత వార్త : గత పది నెలలుగా రాత్రి వేళల్లో ఈ చుట్టు పక్కల అంతా చీకటే, చీకటి వాతావరణంలో ఎన్నో రకాల ప్రమాదాలు ఇదే ప్రదేశంలో జరిగాయి, సునకాలు ఒక్కసారిగా రావడంతో అనేక రకాల వాహనాలు ఇదే ప్రదేశంలో ప్రమాదాలకు గురయ్యాయి,ప్రమాదాలను కళ్లారా చూసిన శివకాశీపురం గ్రామస్తులు ఎన్నిసార్లు సమస్యను వివరించినప్పటికీ అధికారులు స్పందించలేదు. వివరాల్లోకెళ్తే శివకాశీపురం గ్రామం శివాలయం దగ్గరలోని వీధిలైటు గత పది నెలలుగా వెలుగుకు నోచుకోలేదు, స్థంభాన్ని పెనవేసుకొని చెట్ల తీగలు దర్శనమిస్తున్నాయి.చెట్ల తీగలు కరెంటు తీగలని తాకటంతో అప్పుడప్పుడు ఒక్కసారిగా శబ్దాలతో కూడిన భారీ మంటలు కనిపిస్తున్నాయి. కరెంటు పోల్ వద్ద మంటలు రావడంతో చుట్టుపక్కల వాళ్ళు భయాందోళనలకు గురవుతున్నారు.ఎక్కువగా ప్రమాదానికి కారణమయ్యే ప్రదేశంలో స్తంభానికి ఉన్న తీగను తొలగించి బలుగు వెలిగించి ప్రమాదాలను తగ్గించాలని శివకాశీపురం గ్రామ ప్రజలు కోరుచున్నారు.

# జాబ్ కార్డు దారులంతా ఈ కేవైసీ చేయించుకోవాలి
## - తెదేపా నేత మోరంపూడి



చాట్రాయి, నవంబర్ 22, ప్రభాతవార్త : అర్హత ఉండి ఇప్పటి వరకు ఉపాధి హామీ జాబ్ కార్డ్ లేని వారందరూ వెంటనే జాబ్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని అదేవిధంగా జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేయించుకోవాలని ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు. శనివారం చనుబండ సచివాలయం -1లో ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత దశాబ్దంగా పనికి వెళ్ళని వారి జాబ్ కార్డులు కొన్ని రద్దు చేయబడినవని అలాంటి వారు కూడా జాబ్ కార్డ్ కావాలంటే కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాలనీ ఇల్లు కట్టుకోవాలనుకునే వారు కూడా తప్పకుండా ఉపాధి హామీ జాబ్ కార్డ్ తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బుర్రి శ్రీకర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నక్కా రాము, జన సేన నాయకుడు విస్సంపల్లి రాజా, జక్కం కాంతారావు, గవర వెంకటేశ్వర రావు, తాళ్లూరి వీరాస్వామి, గవర గోపి, రైతులు పాల్గొన్నారు.

# దేశ ఘనత తీసుకొస్తున్న లక్కవరం విద్యార్థులు



ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం విద్యార్థిని : జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో జడ్పిటి హైస్కూల్లో విద్యార్థిని జాహ్నవి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)- ఆధ్వర్యంలో ఉత్తమ విద్యుత్తు సామర్థ్యం అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం లోని జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కాసరపు జాహ్నవి ద్వితీయ బహుమతిని గెలుచుకుని ఢిల్లీలో జరుగుతున్న జాతీయస్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపికైందని డీఈవో వెంకటలక్ష్మమ్మ జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయోజులు ఓ ప్రకటనలో తెలిపారు విజేతను తీర్చిదిద్దిచ్చిన లక్కవరం జడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ మనోహర్ ను స్థానిక ఎంఈఓ బి రాముడు. జి రాములు. స్కూల్ హెచ్ఎం దుర్గారావు ఎస్ఎంసి చైర్మన్ దుర్గారెడ్డి ఉపాధ్యాయ బృందం అభినందించారు జాహ్నవికి ఎన్టీపీసీ సింహాద్రి యూనిట్ ఉన్నత అధికారులు రూ 30 వేల రూపాయలు నగదు బహుమతి అందించారు ఇంతటి ఘనత సాధిస్తున్న విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

# నాలుగు లేబర్ కోడ్ లు ఉప సంహరించాలని కార్మికుల నిరసన.



చింతలపూడి.. ప్రభాత వార్త :చింతలపూడి పట్టణంలో ఫైర్ స్టేషన్ సెంటర్ కూడలి వద్ద కార్మిక వర్గం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు మండల కన్వీనర్ నత్త వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం నాయకులు ఎస్కే. కాలేషా మాట్లాడుతూ కార్మిక వర్గం చేసే పోరాటాలకు రైతు సంఘం ఎల్లవేళలా మద్దతు తెలియజేస్తుందని నాలుగు లేబర్ కోడ్ లు ఉపసంహరించుకునే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ వి ఎస్ నారాయణ మాట్లాడుతూ ఈ నాలుగు లేబర్ కోడ్ ల ద్వారా కార్మిక వర్గానికి భారతదేశంలో అనేకమైన ప్రయోజనాలు చేకూరుస్తున్నామని కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అబద్దాలు చెబుతున్నదని స్వాతంత్రం రాకపూర్వం వచ్చిన తర్వాత కార్మిక వర్గాలు అనేక పోరాటాలు ప్రాణ త్యాగాలు చేసి అనేక హక్కులను చట్టాల రూపంలో సాధించుకుంటే మోడీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని ఇవి ఉపసంహరించుకునే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

# జిల్లాలో అధికారికంగా సత్యసాయి జయంతి:కలెక్టర్ నాగరాణి




భీమవరం నవంబర్ 22 ప్రభాతవార్త :జిల్లాలో అధికారికంగా నవంబర్ 23న సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులతో సమావేశమై జిల్లాలో వాడవాడల సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో రేపు సత్య సాయి బాబా 100వ పుట్టినరోజు సందర్భంగా శత జయంతి ఉత్సవాలను నిర్వహించాల్సి ఉందని తెలిపారు.

# మత్స్యసత్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు

మొగల్తూరు నవంబర్ 22 (ప్రభాతవార్త) పేరుపాలెం సౌత్ గ్రామపంచాయతీ పరిధి మొల్లపర్రు గ్రామ సమీపంలో కనకదుర్గ బీచ్ నందు వెలసి ఉన్న శ్రీ మత్స్య సత్యనారాయణ స్వామివారి ఆలయం నందు శనివారం ఉదయం కృష్ణాజిల్లా, మట్టగుంట గ్రామం వాస్తవ్యులు బొమ్మిడి మురళి శ్రీమతి దుర్గాదేవి దంపతులిచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ ఆవరణలో వారి ఆర్థిక సహాయంతో భారీ అఖండన సమారాధన నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, అన్న సమారాధన స్వీకరించారు

# ఇరుకు వంతెనకు మోక్షం కల్పించండి మహాప్రభో
## - నాలుగు గ్రామాల ప్రజలు నరకయాతన



ప్రభాతవార్త, చాట్రాయి : మంకొల్లు చీపురుగూడెం మధ్యలో తమ్మిలేరు లింక్ ఛానల్ పై నిర్మాణం చేసిన ఇరుకు వంతెన నాలుగు గ్రామాల ప్రజలను నరకయాతనకు గురిచేస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు రాకపోకలకు ఆటంకంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు వంతెన వెడల్పు చేయాలని ఎన్నో మార్లు ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు అధికారంలోకి రాగానే వంతెనను వెడల్పు చేస్తామని హామీ ఇవ్వడం మర్చిపోవడం పరిపాటిగా మారింది. కేవలం ఎడ్ల బండ్లు ట్రాక్టర్లు మాత్రమే ఈ రోడ్డుమీద ప్రయాణం చేసే పరిస్థితి ఉంది. నిత్యం మంగపేట, మర్రిబంధం, గౌరీ నగర్, చీపురుగూడెం వాసులు ఎక్కువగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఇరుకు వంతెన వల్ల ఆర్టీసీ బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో సుమారు 6 కిలోమీటర్లు నడిచి వంతెన దాటి మంకొల్లు వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాలు వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో వ్యవసాయ ఉత్పత్తులు రవాణా కూడా ఇబ్బందిగా మారింది. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్లే మా గ్రామంలో వెనుకబడి ఉన్నాయని దీనికి పాలకులే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల నుండి ఉంటున్న వెడల్పు కోసం పోరాటం చేస్తున్నామని పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నూజివీడు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొలుసు పార్థసారథి మంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజలలో వంతెన వెడల్పు జరుగుతుందనే ఆశ మొదలైంది. అయితే స్థానిక నాయకులు వంతెన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా మంత్రి స్పందించి వంతెన వెడల్పుకు చేసేందుకు పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు వంతెన వెడల్పు చేసేందుకు అవకాశం లేదని మంత్రికి చెప్పటంతో కొత్త వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాలు జారీ చేసి ఆరు మాసాలు పూర్తయినప్పటికీ వంతెన నిర్మాణం ఎంతవరకు వచ్చిందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. మంత్రి పార్థసారథి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి వంతెన నిర్మాణానికి శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు. మంత్రి దృష్టిలో ఉంది : లక్ష్మణరావు చీపురుగూడెం మరియు శివారు గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంత్రి పార్థసారథి దుష్టితి తీసుకెళ్లామని త్వరలోనే పూర్తి చేస్తారని చీపురుగూడెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇబ్బందుల నుండి విముక్తి ఎప్పుడో : జగదీష్ నాలుగు దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందుల నుండి విముక్తి ఎప్పుడు వస్తుందో అనే ఎదురుచూస్తున్నామని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మందలపు జగదీష్ అన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ లు ఉప సంహరించాలని కార్మికుల నిరసన.



చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి పట్టణంలో ఫైర్ స్టేషన్ సెంటర్ కూడలి వద్ద కార్మిక వర్గం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు మండల కన్వీనర్ నత్త వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం నాయకులు ఎస్కే. కాలేషా మాట్లాడుతూ కార్మిక వర్గం చేసే పోరాటాలకు రైతు సంఘం ఎల్లవేళలా మద్దతు తెలియజేస్తుందని నాలుగు లేబర్ కోడ్ లు ఉపసంహరించుకునే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ వి ఎస్ నారాయణ మాట్లాడుతూ ఈ నాలుగు లేబర్ కోడ్ ల ద్వారా కార్మిక వర్గానికి భారతదేశంలో అనేకమైన ప్రయోజనాలు చేకూరుస్తున్నామని కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అబద్దాలు చెబుతున్నదని స్వాతంత్రం రాకపూర్వం వచ్చిన తర్వాత కార్మిక వర్గాలు అనేక పోరాటాలు ప్రాణ త్యాగాలు చేసి అనేక హక్కులను చట్టాల రూపంలో సాధించుకుంటే మోడీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేయడానికి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని ఇవి ఉపసంహరించుకునే వరకు కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తోర్లపాటి బాబు మాట్లాడుతూ ఈ వినాశకర నాలుగు లేబర్ కోడ్ లు భారతదేశ కార్మిక వర్గాలకు నేటి నుంచి శాపంగా పెరగణించబడుతున్నాయని మాయమాటలతో కార్మిక వర్గానికి అనేక ప్రయోజనాలు ఈ నాలుగు లేబర్ కోడ్ ల ద్వారా చేకూర్తాయని అధికారుల ద్వారా, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం బూటకపు ప్రచారం చేస్తుందని కార్మికులకు అనేక హక్కులను లేకుండా చేసి ఈ నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టారని, కార్మికులు తిరస్కరించిన ఈ లేబర్ కోడ్ లు అమలుచేసి బడా పారిశ్రామికవేత్తలను పెంచి పోషించడానికి మోడీ కంకణం కట్టుకున్నారని కార్మిక వర్గం ఐక్యతతో ఈ లేబర్ కోడ్ లను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ మండల కన్వీనర్ పాండురంగారావు కార్మికుల నిరశనకు మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమాలు అంగన్వాడి యూనియన్ నాయకురాలు సరోజిని, హేమలత, శ్యామల, అరుణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పుణ్యవతి, పాల్గొన్నారు.

# మన్యం జిల్లాలో జరిగిన రెండు ఎన్కౌంటర్లపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి



ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది విక్రమ్ భవనం నుండి ప్రదర్శన బోసు బొమ్మ సెంటర్ బస్టాండ్ మీదుగా కొనసాగింది అనంతరం జరిగిన సభకు కెవి రమణ అధ్యక్షత వహించగా కారం రాఘవ మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్లపై పలు అనుమానాలు ఉన్నాయని వైద్యం కోసం వచ్చిన వారిని పట్టుకుని ఎన్కౌంటర్ చేశారని ఆ పార్టీ ప్రకటించిందని అన్నారు న్యాయమూర్తితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని రాఘవ డిమాండ్ చేశారు విజయవాడ ఏలూరు కాకినాడ కృష్ణా జిల్లాలలో 50 మంది వరకు మావోయిస్టులు వారి సానుభూతిపరులను పోలీసులు అరెస్ట్ చేశారు అని వారే కాకుండా ఆ పార్టీ అగ్ర నాయకులు అరెస్ట్ అయినట్లుగా తెలుస్తుందని వారిని వెంటనే కోర్టులో హాజరపరచాలని డిమాండ్ చేశారు జరిగిన రెండు ఎన్కౌంటర్లు అనుమానస్పదంగా ఉన్నాయని వాటిపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని ప్రస్తుత న్యాయమూర్తి చే విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు నేడు కేంద్ర హోం మంత్రి ప్రకటన చూస్తే రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ప్రజలపై దాడులు కొనసాగిస్తున్నారని అడవిలో ఖనిజ సంపద అటవీ సంపదలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి ఈ దాడులు చేస్తున్నారని అమాయక ఆదివాసీలను కూడా ఈ దాడుల్లో చంపి వేస్తున్నారని రాఘవ అన్నారు ఇప్పటికైనా ఈ దాడులు నిలిపివేయాలని కాగార్ ఆపరేషన్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు ఇంకా ఈ సభలో తగరం బాబురావు కెచ్చేల పోతురెడ్డి పి డి ఎస్ యు నాయకులు ఈ భూషణం పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే లత కారం లక్ష్మి కట్టం నాగేశ్వరరావు అరుణోదయ నాయకుడు నడపల ముక్కారెడ్డి కె ప్రతాప్ రెడ్డి తదితరులు మాట్లాడారు

# పేకాట శిబిరం పై దాడి
## - అదుపులోకి ముగ్గురు - ద్విచక్ర వాహనాలు,రు.6,750స్వాధీనం



చాట్రాయి, నవంబర్22, ప్రభాతవార్త : చాట్రాయి మండలం నరసింహారావుపాలెం గ్రామంలో పేకాట శిబిరం పై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద 6.750లు నగదు తో పాటు 2 మోటార్ సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ చెప్పారు. పోలీసులకు రాబడిన సమాచారం మేరకు స్టేషన్ సిబ్బంది నరసింహారావు పాలెం గ్రామము శివారులో పేకాట శిబిరం పై దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అదుపులో తీసుకున్న వారిపై చాట్రాయి పోలీస్ స్టేషన్లో కేసును నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలియ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులను కలగజేసే జూద క్రీడలను ఎవరైనా ప్రోత్సహిస్తే లేదా పాల్గొన్న అట్టి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జూదం ఏ రూపంలో ఉన్న ఉపేక్షించమని ప్రజలు వారి యొక్క ఆర్థిక ఇబ్బందులు కలిగించే జూద క్రీడల యొక్క సమాచారాన్ని పోలీసు వారికి తెలియ చేయాలి అని, సమాచారం అందించినటువంటి వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్,
ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, దెందులూరు, పెదవేగి, పోలవరం,కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా...
ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు సంప్రదించవలెను.
ఫోన్ : 9704502377

# వరాల వెంకన్న ను దర్శించుకున్న భక్తులు



అత్తిలి - నవంబర్ 22( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఈడూరు గ్రామం లోని వరాల వేంకటేశ్వరస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ , తోమాల సేవ , విశేష అర్చనలు జరిపారు. భక్తులకు దేవాలయ కమిటీ సహకారం తో అన్నదానం జరిపారు. అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు , వల్లి వెంకటేష్ , సూర్య తేజ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

# కొత్తబస్టాండ్ లో టాయిలెట్స్ ప్రారంభం



భీమవరం నవంబర్ 22ప్రభాతవార్త : భీమవరం కొత్తబస్టాండ్ లో శనివారం జిల్లా ప్రజా రవాణాధికారి ఎన్.వి.ఆర్.వరప్రసాద్ ఆధ్వర్యంలో నూతన టాయిలెట్స్ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ప్రయాణికులను మౌలిక సదుపాయాలు,ఆర్.టి.సి ఉద్యోగులను స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు చేయడం గురించి వివరములు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్ స్టేషన్ యార్డ్ నందు పచ్చని మొక్క నాటారు ప్రయాణికులకు,ఉద్యోగులకు అనునిత్యం అత్యంత శుభ్రతతో ఉపయోగపడే విధంగా అధునాతనంగా టాయిలెట్స్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ప్రయాణికులు ఉపయోగించిన టాయిలెట్స్ శుభ్రపరచడానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏర్పాటు చేయడం జరిగినదని చెప్పారు.

# నేడే సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవం

అత్తిలి -నవంబర్ 22( ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశముల మేరకు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శత జయంతి ఉత్సవాలు ఆదివారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరం లో జరుగుతాయని ఎంపీడీవో పి. శ్యామ్యూల్ తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

# సి సి ఎల్ ఏ ముట్టడిని విజయవంతం చేయండి.



అత్తిలి -నవంబర్ 22( ప్రభాతవార్త ):తాడేపల్లిగూడెం డివిజన్ ఇరగవరం మండలం లో వి ఆర్ ఏ ల సమావేశం మండల అధ్యక్షులు కట్టుంగ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. డిసెంబర్ 16న సీ సీఎల్ ఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీఆర్ఏలను కోరారు. జిల్లా లో అటెండర్, నైట్ వాచ్మెన్,,వి ఆర్ ఓ,డ్రైవర్ పోస్ట్ లు వి ఆర్ ఏ ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వి.ఏ.వి. పండు, యాక్షన్ కమిటీ కార్యదర్శి బుంగ గణేశ్వరరావు, జిల్లా సెక్రెటరీ మూటూరి మోషే, భీమవరం డివిజన్ ప్రెసిడెంట్ సుబ్బారావు, రాపాక ఏసురత్నం,కట్టుంగ కోటేశ్వరరావు,ప్రసన్న, వి ఆర్ ఏ లు మల్లయ్య.సుదర్శన్, సురేష్, పెద్దిరాజు పాల్గొన్నారు .

# ఉచిత హోమియోపతి వైద్య శిబిరం బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో



పెనుగొండ, నవంబర్ 22 ప్రభాతవార్త: పెనుగొండ తేతలి వారి వీధిలో గల ఆధ్యాత్మిక సంస్థ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి వారి ఆధ్వర్యంలో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కె. సత్యనారాయణ మొత్తం 90 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ అనారోగ్య సమస్యలకు ఉచితంగా ఔషధాలను అందజేశారు అని బ్రాంచి నిర్వాహకులు బి.కె. మణి, బి.కె. ఉష, ప్రసాద్ తెలిపారు.ప్రతి నెల మూడవ బుధవారం నిర్వహించే ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు తప్పకుండా వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ ఉచిత శిబిరంలో భవాని, వాణి, రమావతి, అరుణ, తులసి తదితర రోగులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవల్లో నిరక్ష్యంపై సిఎం చంద్రబాబు ఆగ్రహం



**విజయవాడ,నవంబరు22, ప్రభాతవార్త ప్రతినిధి :** కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవల్లో నిరక్ష్యంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిరక్ష్యం చూపిన వైద్యులు, సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందిన గర్భిణి కుటుంబానికి సాయం అందించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు తెలిపారు. కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరిగిన ఘటనలో, తాళ్లరేవు మండలం గడిమొగ గ్రామానికి చెందిన 8 నెలల గర్భిణి మల్లేశ్వరి వైద్యుల నిరక్ష్యంతో ప్రాణాలు కోల్పోయారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 55 ఏళ్ల రోగికి అక్టోబర్ 2025 తేదీకి గడువు ముగిసిన మందులను నవంబర్ 8న అక్కడ ఆసుపత్రి వర్గాలు ఇచ్చాయి. వాటిని వాడిన రోగి మరింత అనారోగ్యం పాలయ్యారు. ఈ రెండు ఘటనలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 నెలల గర్భిణి మల్లేశ్వరికి కొన్ని మెడిసిన్లు పడవనీ, అలెర్జీ ఉందనీ, వీటితోపాటు హైపర్ టెన్షన్, డయాబెటిస్ కూడా ఉన్నాయని కేస్ షీట్ లో నమోదు చేసి ఉన్నట్లు తెలుస్తుంది. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నవంబర్ 20న మధ్యాహ్నం పీజీ విద్యార్థిని గర్భిణికి అలెర్జీ ఉన్న ఇంజెక్షన్‌ను ఇచ్చారు. దీనివల్ల పేషెంట్‌కు వెంటనే ఫిట్స్, అనంతరం కార్డియాక్ అరెస్ట్ అయ్యింది. ఈ క్రమంలో ఆమె రాత్రి 10 గంటల సమయంలో మరణించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణా లోపం కూడా దీనికి కారణమని కారణమని తేలింది. ఇదిలా ఉండగా రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో 55 ఏళ్ల రోగికి అక్కడి వైద్య సిబ్బంది అక్టోబర్ 2025 నాటికి గడువు ముగిసిన మందులు నవంబర్ 8న ఇచ్చారు.

వాటిని వాడిన రోగి మరింత అనారోగ్యం పాలయ్యారు. ఈ రెండు సంఘటనలు వైద్య సిబ్బంది నిరక్ష్యానికి అద్దం పడుతున్నాయని పలువురు ధ్వజమెత్తు తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

# ఛాయ్ రాస్తా అవుట్ లెట్ ప్రారంభించిన నారా భువనేశ్వరి



**కుప్పం, నవంబరు 22: ప్రభాతవార్త:** ఒక కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారుచేయాలనే సంకల్పంలో భాగంగా కుప్పంలో డ్వాక్రా మహిళలచే ఏర్పాటుచేసిన ఛాయ్ రాస్తా అవుట్లెట్ను ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరీ ప్రారంభించారు. రుచి, శుచి, నాణ్యత ప్రధానంగా కార్పొరేట్ తరహాలో ఏర్పాటైన ఛాయ్ రాస్తా అవుట్ లెట్లో ఆమె మొదటి ఛాయ్ని కోనుగోలు చేశారు.. చాయ్ రాస్తా అవుట్లెట్లో రుచి, శుచి చక్కగా ఉన్నాయని ఆమె ప్రశంసించారు. ఐఐఎం, ఐఐటి గ్రాడ్యుయేట్ల భాగస్వామ్యంతో రూపొందించిన చాయ్ రాస్తా చాలా సరికొత్తగా ఉందని ఆమె అభినందించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని భువనేశ్వరీ అన్నారు. కుప్పం డెవలప్మెంట్ ఆథారిటీ (కడా) మద్దతుతో ముందుగా కుప్పంలో ఈ ఛాయ్ రాస్తా అవుట్ లెట్ ప్రారంభం కావడం శుభపరిణామం అన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రతి నెల స్థిరమైన ఉపాధితో పాటు వారికి గౌరవాన్ని కల్పించేలా ఛాయ్ రాస్తా అవుట్ లెట్లు పనిచేయన్నాయి. మెప్మా భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో ఛాయ్ రాస్తా అవుట్లెట్లు ప్రారంభం కానున్నాయి. డ్వాక్రా మహిళలకు స్థిరమైన ఆదాయం, గౌరవం ఛాయ్ రాస్తా అవుట్ లెట్లతో లభిస్తుందని ఛాయ్ రాస్తా సీఈఓ మైకేల్ జోషి తెలిపారు.. మహిళలు ఎంతో సులువుగా ఛాయ్రాస్తా అవుట్ లెట్ నిర్వహించవచ్చని, ఆధునాతన టెక్నాలజీతో ఈ ఛాయ్ రాస్తా అవుట్ లెట్లు ఉంటాయన్నారు.



# ముగిసిన రాష్ట్రపతి ముర్ము ఒకరోజు పర్యటన

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 22, ప్రభాతవార్త :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ ఒకరోజు పర్యటన ముగిసింది. శనివారం బేగంపేట విమానాశ్రయం నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక విమానంలో బయలుదేరి పుట్టపర్తికి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ హరిచందన దాసరి, డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ ఉన్నతాధికారులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నగర పోలీసుల ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంతోపాటు రాష్ట్రపతి ప్రయాణించిన మార్గంలో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసారు.

# 27తో ముగియనున్న జెఇఇ మెయిన్-2026 దరఖాస్తుల ప్రక్రియ

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటిలు, ఎన్ఐటీల్లో ఇంజి నీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జెఈఈ) (మెయిన్) పరీక్ష మొదటి విడత పరీక్షలకి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 27తో ముగియనుంది. అక్టోబరు 31 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ 27తో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు మొదటి విడత పరీక్షలను నిర్వహించనున్నారు. జనవరి మొదటి వారంలో పరీక్షలను నిర్వహించే నగరాలను ప్రకటించనున్నారు. అడ్మిట్ కార్డుల డైన్‌లోడ్ ప్రక్రియను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనేది దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తరువాత ప్రకటించనున్నారు. ప్రతి ఏడాది రెండు విడతలుగా జెఈఈ మెయిన్ పరీక్షలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా జెఈఈ మెయిన్- 2026 మొదటి సెషన్ పరీక్షలను వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సిబిటి) విధానంలో జెఈఈ మెయిన్-2026ను రెండు సెషన్‌లలో (జనవరి, ఏప్రిల్ 2026) నిర్వహించ నుంది. ఇందుకు సంబంధించి సెషన్-1 కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తు న్నారు. రెండో సెషన్‌కి సంబంధించిన పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జనవరి చివరి వారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) నిర్ణయించింది. విద్యార్థులు దరఖాస్తులో ఆధార్‌తోపాటు, మెమో ఆధారంగా ఉన్న పేర్లను నమోదు చేసుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ఎన్‌టిఏ అధికారులుసూచించారు. మొదటి విడత జెఈఈ మెయిన్ పరీక్షల ఫలితాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేయనున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. జెఈఈ మెయిన్ పరీక్షలను మొత్తం 13 భాషల్లో నిర్వహించనున్న సంగతి తెలిసిందే.




గీత కార్మికుల సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# గీత కార్మికులకు 45 లక్షల తాటి, ఈత మొక్కల పంపిణీకి ప్రభుత్వం సిద్ధం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 45 లక్షల తాటి, ఈత మొక్కలను పంపిణి చేసేందుకు సిద్ధంగా ఉందని, వాటి పెంపకానికి కల్లుగీత సంఘాలు ముందుకు రావాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటేందుకు వాటిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. గీత పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం అంటే తనకు ఎంతో గౌరవమని ప్రభుత్వంతో చర్చించి మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు పెట్టె విధంగా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన గీతపనివారల సంఘం రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ అధ్యక్షత వహించారు. గీత కార్మికుల రక్షణతోపాటు తమ పిల్లల విద్యాభ్యాసానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు నెగ్గెందుకు విద్య చాలా అవసరమని, తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. గీతకార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కాటమయ్య రక్ష, సంఘపరమైన భవనాలకు సంబంధించి అన్ని గౌడ కులపెద్దలతో కలిసి అమలు జరిగేలా చేద్దామన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి తాను సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ట్యాంక్‌బండ్‌పైన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటును త్వరలో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలుగౌడ్, కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షుడు కెవిఎల్, దూసరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# జనాభాకు అనుగుణంగా పశు సంరక్షణ, పెంపకం పెరగాలి

## చేపలు, గొర్రెలు, మేకలు, పశు సంరక్షణకు కృషి

## ఘనంగా పశువైద్య విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి

**హైదరాబాద్ (అత్తాపూర్) నవంబరు 22, ప్రభాతవార్త :** తక్కువ ధరకు దొరికే గుడ్లలో పోషకాలు చాలా ఉన్నాయని ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని పశుసంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, రవాణా శాఖ కార్యదర్శి డా. ఇలంబర్తి పేర్కొన్నారు. శనివారం పివి ఎన్ఆర్ తెలంగాణ పశువైద్య విశ్వవిద్యా లయం 11వ విశ్వ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఇలంబర్తి హాజరై హార్టికల్చర్ వీసీ అంజి రెడ్డి, పశువైద్య విశ్వవిద్యా లయ వీసీ జ్ఞాన ప్రకాష్ లతో కలిసి జ్యోతి వెలి గించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసి ఎఆర్ షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక నిధుల కింద మంజూరు చేసిన ఇ రిసోర్సెస్ (పుస్తకాలు, జర్నల్స్)ను ఆయన ప్రారంభించారు. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ నందు అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా ఆయన సందర్శించి పాడి రైతులు, పెంపుడు జంతువుల యజ మానులకు అందించే ఉత్తమ క్లినికల్ సేవలను ప్రశంసించారు. ప్రజారోగ్యం పరంగా ఈ రంగం ప్రాముఖ్యతను రాష్ట్ర జీఎస్డీపికి ఈ రంగం సహకారాన్ని పునరుద్ఘాటించారు. పాలు, గుడ్డు, మాంసం ఉత్పత్తుల ద్వారా తక్కువ ధరకు పౌష్టికాహారం అందించడం గురించి నొక్కి చెప్పారు. రాష్ట్ర జనాభా పెరిగిన కొద్దీ పశువు సంరక్షణ, పశువు పెంపకం పెంచాలని ఆయన కోరారు. అనంతరం మరో అతిథి కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజీరెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో పరిమితుల మధ్య పివిఎన్ఆర్‌టీవి సాధించిన పురోగతి గురించి ప్రశంసించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎం జ్ఞానప్రకాష్ విశ్వవిద్యాలయ పరిధిలోని సంస్థల పురోగతి గురించి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. శరత్ చంద్ర, ప్రొ.డి. మాధురి, అసోసియేట్ డీన్, విస్తరణ విభాగం అధిపతి డా సత్యనారాయణ, బోధన, బోధనేతర అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇలంబర్తి, హార్టికల్చర్ విసి అంజిరెడ్డి, విపి జ్ఞానప్రకాష్

## అజెండా పక్కనబెట్టి ఇరిగేషన్ ఇంజినీర్లకు

# మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్లాస్!

## ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెంచడంతో పక్కన పెడుతున్న సిఎం

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** 'ఇష్టం వచ్చినట్లు ప్రాజెక్టు అంచనాల వ్యయాలు పెంచుతున్నారు దీనితో ముఖ్యమంత్రి మన ఫైల్స్ పక్కన పెడుతున్నారు' అంటూ నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులపై శనివారం తీవ్రఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. జలసౌధలో జరి గిన సమావేశం ఎజెండాను పక్కనపెట్టి మంత్రి అధికారులకు ఫుల్‌గా క్లాస్ తీసుకొనట్లు తెలిసింది. కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు రూపొందించడంలో జాప్యం చేయడం, నిర్మాణంలో ఉన్న పనులలో జాప్యం జరగం వంటి అంశాలపై ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తంచేసిట్లు తెలిసింది. నీటిపారుదలశాఖ ఇంజనీర్లు రూపొందిస్తున్న అరకొర సమాచారంతో వస్తున్న ప్రతిపాదనలు సిఎం ఆఫీసు నుంచి వెనక్కిరావడమో లేదా వాటిని అక్కడే పక్కనపెట్టడమో జరుగుతున్నట్లు తెలిసింది. తుమ్మడిహట్టి నుంచి సుందిళ్ళ విఫల బ్యారేజికి నీళ్ళు తరలించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సుముఖత వ్యక్తం చేయడంలేదని అధికారులు చర్చించుకొంటున్నారు. ఇంటర్‌స్టేట్ వాటర్ రీసోర్సు యూనిట్, సిడిఓ డిపార్టుమెంట్ అధికారులు సరిగా పనిచేయకపోవడంతో అనేక సమస్యలు అలాగే పెండింగ్‌లో ఉంటున్నాయి. 18 అంశాల ఎంజెండా చర్చకు రాకుండానే మొత్తానికి సమావేశం ముగించారని అధికారులు చర్చించుకొంటున్నారు. ఆర్థికశాఖ అనుమతితోనే ప్రాజెక్టు వ్యయాలు పెంచుతామని ఇలాంటి సందర్భంలో సిఎం కూడా ఫైల్స్ పక్కన పెట్టడం ఏంటని కొంత మంది అధికారులు నొచ్చుకొన్నట్లు తెలిసంది. సమ్మక్కసాగర్ ఛత్తీస్గడ్ ఎన్ఓసి అంశం, టిఎసి, సిడబ్ల్యుసి అంశాలతోపాటు మేడిగడ్డ,అన్నారం, సుందిళ్ళ బ్యారేజిలను ను ఎన్‌డిఎస్ఏ సూచనలమేరు మర్మమతు చేయడానికి సంబందించిన కార్యచరణ జలసౌధలో కీలకమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉండాల్సి ఉండగా అవి కూడా పక్కన పడ్డట్లు తెలిసింది. తుమ్మడిహట్టి నుంచి సుందిళ్ళకు నీటి తరలింపు అంశం, ఎఎంఆర్‌పి ఉదయసముద్రం, గట్టుప్రాజెక్టు, సింగూరు ప్రాజెక్టు మరమ్మతు, మిషన్‌కాకతీయ,డిండి, జూరాల ప్రత్యామ్నయ బిడ్జి,పదోన్నతలు, 2023 డిసెంబరు 7నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులపై ఖర్చుచేసి అంశాలపై చర్చ జరగకుండా కేవలం అధికారులు ఇష్టం వచ్చినట్ల ప్రాజెక్టు కాస్టుబూస్టప్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశం ముగిసిందని తెలిసింది.



ట్రోఫీతో మాడవి కావేరి

# అండర్-19 గోల్డ్‌క్వీన్ మాడవి కావేరి

**పెంచికల్‌పేట్, నవంబరు 22, ప్రభాతవార్త :** ఒడిశా నేలపై జరిగిన అండర్-19 జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని గుండెపల్లి గిరిజన గ్రామానికి చెందిన విద్యార్థి మాడవి కావేరి అద్భుత ప్రతిభతో బంగారు పతకం సాధించింది. మారుమూల గిరిజన గ్రామా నికి చెందిన మాడవి వనితరాంజీల కుమార్తె అయినా కావేరి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కలశాల ఉట్నూర్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. కావేరి జాతీయ వేదికపై బంగారు పతకం సాధించడంతో గ్రామంలో ఆనందో త్సాహాలు వెల్లివిరిశాయి. క్రమశిక్షణ, కష్టపడే తత్తం, ఓటమిని ఒర్చుకునే ధైర్యంతో ప్రతి బౌట్‌లో ప్రత్యర్థులను వశం చేసు కుంటూ అత్యుత్తమంగా పోరాడి బంగారు పతకాన్ని సాధించిన కావేరిని గ్రామస్థులు, పలువురు అభినందించారు.

# హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ఈ నెల 25 నుండి మూడు రోజుల పాటు హైటెక్స్‌లో నిర్వహించనున్నారు. వికసిత్ భారత్ దిశగా స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్‌కు బాటలు వేసేలా వన్ నేషన్-వన్ ఎక్స్‌పో అనే థీమ్‌తో 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 50 దేశాల నుండి 500 మందికి పైగా ఎగ్జిబిటర్స్, 40 వేలకుపైగా సందర్శకులు పాల్గొంటారని నిర్వహకులు తెలిపారు. అలాగే వివిధ దేశాలకు చెందిన 1,500 మంది ప్రతినిధులు, నిపుణులు హాజరవుతారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో సస్టెయినబుల్ ఫీడ్ సెల్యూషన్స్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, అటోమేషన్, భవిష్యత్ ఉద్యోగవకాశాలు తదితర ప్రధాన అంశాలపై ఈ అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో చర్చ జరగనుంది.



# తెలంగాణ వైద్య విధానపరిషత్‌ను పూర్తిస్థాయి ప్రభుత్వ శాఖగా మార్చాలి

## ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లోని ఖాళీ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి

## మంత్రి దామోదర రాజనర్సింహకు టిజిజిడిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణ వైద్య విధాన పరిషత్తు(టివివిపి)ను పూర్తిస్థాయి ప్రభుత్వ శాఖగా మార్చాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజిజిడిఎ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దాంతోపాటు వైద్య శాఖలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేసింది. డిఎంఇ, డిహెచ్, టివివిపి విభాగాల్లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టివివిపిని పూర్తిస్థాయి ప్రభుత్వ శాఖగా మార్పు చేయాలని కోరారు. టివివిపిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చుతామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ.. ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. దీని మూలంగా టివివిపి వైద్యుల పరిపాలన, సేవా నియమాలు, పదోన్నతులు, ప్రమోషన్లపై నేరుగా ప్రభావం చూపుతోందని అసోసియేషన్ నేతలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు. వైద్యవిద్యా నాణ్యతను నిలబెట్టడానికి ఇది అత్యంత కీలకంగా మారుతుందన్నారు. ఫెరిఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్ మంజూరును ప్రభుత్వం ఆమోదించినప్పటికీ ఇంకా విడుదల కాలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిమూలంగా కొత్త మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిజిజిడిఎ నేతలు తెలిపారు.

జిఓఎంఎస్ నంబర్ 142ను సవరణ చేయాలన్నారు. జిఒ మూలంగా డిఎంహెచ్ఒ పోస్టులను జనరల్ లైన్ డాక్టర్లకు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, సవరణ నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదన్నారు. వెంటనే సవరణ చేస్తూ జీవో జారీ చేయాలని మంత్రిని కోరారు. డిహెచ్, డెంటల్ కేర్ వైద్యుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) అమలు విషయంలో ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, కార్యరూపం దాల్చలేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో టిజిజిడిఎ అధ్యక్షుడు డాక్టర్ నరహరి బాపనపల్లి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్, ట్రెజరర్ డాక్టర్ ఎం.కే. రౌఫ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దీన్ దయాల్, సీఈసీ మెంబర్ డాక్టర్ రాజశేఖర్ ఉన్నారు.

# తక్షణమే జిఒ నం. 46ను ఉపసంహరించుకోవాలి

## లేదంటే పెద్దఎత్తున బిసిల ఆందోళన తప్పదు

## ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబరు 46ను విడుదలచేసి ఎస్సీ, ఎస్టీ, బిసిలకు కలిపి 50శాతం లోపు రిజర్వేషన్‌లు కొనసాగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి మార్గదర్శకాలను విడుదల చేయడం బిసిలకు చేసిన పచ్చిదగా అని రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య ధ్వజ మెత్తారు. తక్షణమే జిఒ నంబరు 46ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రెండు రోజుల్లో అన్ని సంఘాలతో సమావేశమై పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌లపై ఒకవైపు హైకోర్టులో వాద నలు కొనసాగించడానికి గడువు ఉన్నప్పటికీ ఆ దిశగా నిబద్ధతతో చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ముందుగానే చేతులు ఎత్తివేసి జిఒను విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని గత రెండేళ్ల గా ప్రభుత్వం ప్రకటిస్తూనే బిసిలను మోసం చేస్తూ బిసిలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఈ నెల 20న డెడికేటేడ్ కమిషన్ నివేదిక ఇచ్చిందంటూ, ఆ నివేదిక ఆధారంగా జిఒ నంబరు 46ను విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధానమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళితే పరిష్కారం అయ్యేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని, ఇప్పటికైనా ఎన్నికలను వాయిదా వేసి కోర్టులో జడ్జిమెంట్ వచ్చేంతవరకు అగాలని, ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల నుంచి తిరుగుబాటు తప్పదని ఆర్.కృష్ణయ్య హెచ్చ రించారు.

# ప్రమాదకర లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** కార్మికులకు ప్రమాదకరంగా మారనున్న నూతన లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రమాదకరమైన లేబర్‌కోడ్లను ఉపసం హరించు కోవాలని కార్మికులు దేశ వ్యాపితంగా సమ్మెలు చేస్తున్నా, కార్మిక సంఘా లతో ఎలాంటి చర్చలు లేకుండానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఏకపక్షంగా ప్రకటించి శనివారం నుండి అమలుకు పూనుకున్నదని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే, ప్రమాదకరమైన కార్మిక చట్టాలను తక్షణమే ఉపసం హరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో కార్మికులు తమ రక్షణ కోసం సాధించు కున్న 29 పాత చట్టాలకు కేంద్రం ప్రభుత్వం తెచ్చిన లేబర్‌కోడ్స్ తిలోదకాలు ఇస్తున్నాయన్నారు. కార్మికుల వేతనాలు, పని గంటలు, సామాజిక భద్రత వంటి హక్కులను కాల రాస్తు న్నాయని మండిపడ్డారు. కొత్త చట్టాలతో కార్మికులు సమ్మె చేసే హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌లకు అనుకూలంగాను, కార్మికుల హక్కులకు తీవ్రనష్టం కల్గించే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయనున్నట్టు జాన్‌వెస్లీ స్పష్టం చేశారు.




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులను తక్షణమే క్రమబద్ధీరించాలి

## ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగా అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తరువాతే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయా లని ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. గత రెండు దశాబ్దాలు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకుల జెఎసి ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 శాతం నిధులు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించిందని, 15 శాతం కేటాయించవలసి ఉందన్నారు. అధ్యాపకుల క్రమబద్ధీకరణ కోసం విశ్వవిద్యాలయాల్లోని వైస్ ఛాన్సలర్స్ ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు దీనస్థితిలో ఉన్నాయని, పూర్తి స్థాయిలో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై ఉన్నత విద్యా శాఖ మండలి, విద్యా కమిషన్ దృష్టికి తీసుకు వెళతానని చెప్పారు. ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ అధ్యాపకుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సభ అధ్యక్షుడు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, రాష్ట్ర గ్రంథాలయాల ఛైర్మన్ రియాజ్, జెఎసి కన్వీనర్ డా.పరుశురామ్, కో-కన్వీనర్లు డా.ఓర్సు కృష్ణయ్య, పాండయ్య, రాందాస్‌నాయక్, డా.కవిత తదితరులు పాల్గొన్నారు.

చికెన్ రెసిపీలు ఫ్లేవర్‌పుల్ కబాబ్స్

క క కబాబ్ బాగుందీ.. అని పాడుకోవాలి, ఇలా కానీ ట్రై చేశారంటే సరిగ్గా వండాలే కానీ కబాబ్ టేస్ట్ ఎవరికి నచ్చదు చెప్పండి? అందుకే ఈ ఫ్లేవర్‌పుల్ కబాబ్స్‌ను మీరూ చేసి చూడడండి.

# ఫ్లేవర్‌పుల్ కబాబ్స్

## తంగ్డీ చికెన్ కబాబ్ .



**కావాల్సినవి:** చికెన్ లెగ్ పీసులు 6, గరంమసాలా చెంచా, మైదాపిండి- చెంచా,కార్న్‌ఫ్లోర్-2 కారం 2, ఉప్పు, నూనె-సరిపడా. నిమ్మరసం, మిరియల పొడి - చెంచా పచ్చిమిర్చి పేస్ట్-2 చెంచాలు, గుడ్లు-2,పసుపు-పావుచెంచా, అల్లంవెల్లుల్లి ముద్ద -2 చెంచాలు.

**తయారీ:** చికెన్ లెగ్ పీసులని శుభ్రంగా కడిగి చిన్నగా గాట్లు పెట్టుకోవాలి. తర్వాత ఒక పానరతలో గుల్లను పగలకొట్టి కలిపి పక్కన పెట్టాలి. మరో పానరతలో నిమ్మరసం, ఉప్పు, మసాలా, కార్న్‌ఫ్లోర్, మైదా, పచ్చిమర్చి ముద్ద, అల్లం వెలుల్లి పేస్ట్, పసుపు, ఉప్పు, కారం, మిరియాల పొడి, పక్కకు పెట్టిన గుడ్ల మిశ్రమాన్ని వేసి బాగా కలిపి లెగ్ పీసులను కూడా మేసి మొత్తం కలిసేలా పట్టించి 10 నిమిషాలు పక్కకు పెట్టాలి. ఒక కడాయిలో నూనె పోసి వేడయ్యాక ఒక్కక్కటిగా లెగ్ పీసులను వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. తే తంగీ చికెన్ కబాబ్ రెడీ.

## వెజ్ షమీ కబాబ్ ..



**కావాల్సినవి :** ఉల్లిపాయలు-2 (చిన్నవి), శనగలు కప్పు, పచినచమర్చి-3, కొత్తిమీర, పుదీనా, కరివేపాకు- పావుకప్పు, ఉప్పు, కారం, నూనెసరిపడా, ధనియాలపొడి- చెంచా, గరంమసాలా-చెంచా, పసుపు-చిటికెడు, శనగపిండి-2 చెంచాలు, బియ్యంపిండి- చెంచా.

**తయారీ :** శనగలను ముందురోజు రాత్రి నానబెట్టాలి. నీళ్లు వడకట్టి కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చేవరకు ఉడకనిచ్చి తీశాక కచ్చా పచ్చాగా మిక్సీ పట్టాలి. ఒక పాత్రలో శనగల మిశ్రమం, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, శనగపిండి, బియ్యంపిండి, ఉప్పు, కారం, కొత్తిమీర,పుదీనా, మసాలా, ధనియాల పొడి.. అన్నీ వేసి కొద్దిగా నీళ్లు పోసి కబాబ్స్ చేయడానికి వీలుగా కలపాలి. చిన్న చిన్న గారెలుగా రౌండ్‌గా చేసుకొని పక్కకు పెట్టాలి. ఒక కడాయిలో నూనె పోసి కబాబ్స్‌ని రెండు వైపులా బంగారురంగు వచ్చేవరకు కాల్చుకోవాలి.

1. నల్ల శనగలు అయితే ఇంకాసనత రుచిగా ఉంటుంది.
2. ఈ కబాబ్స్‌ని టమాటా, పుదీనా చట్నీతో తింటే కాంబినేషన్ అదిరిపోతుంది.

**చెఫ్ టెక్నిక్ ..** మాంసం వండేటప్పుడు నీరు మరిగే దశ్కఉ వచ్చాక మంట తగ్గిస్తాం కదా.. ఇలా చేయడం వల్ల అందులోని ఫ్యాట్, ప్రొటీన్లు విడుదలై కూరకు చక్కని రుచి వస్తుంది. దీన్ని సిమ్మరింగ్ అంటారు. ఈ టెక్కిక్ సూప్స్, గ్రేవీలు, దుంప జాతి కూరగాయలు, కొన్ని రకాల ధాన్యాలు వండటంలో మెరుగ్గా పనికొస్తుంది. □

# ఆమెకు సేవే ఆనంద మార్గం ..



**ఇరవైల్లో ఉన్న యువత ఎవరికైనా సరదా, సంతోషాలే ప్రపంచం. కానీ, తమిళనాడుకి 22 ఏళ్ల షాలిని మాత్రం తనకు సేవే ఆనంద మార్గం అంటూ మరికొంతమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.**

అప్పటికి షాలిని వయసు పందొమ్మిదేళ్లు. తండ్రితో కలిసి ఓ పనిమీద కారులో బరులుదేరారు.. గమ్యం చేరకుండానే ఓ పెద్ద ప్రమాదం. తీవ్రగాయాల పాలైన తండ్రి ప్రాణాలను కాపాడమని... ఆమె చుట్టూ ఉన్నవారిని అర్థించారట. ఏ ఒక్కరూ స్పందించలేదు సరికదా! మానవత్వం మరిచి ఫొటోలూ, వీడియోలు తీశారు. ఆ సంఘటననూ షాలిని పై చెరగని ముద్రవేసింవి. దాంతో నాన్న చనిపోయిన బాధనే కాదు. ఆది మరిచిపోలేకపోయారు. ఆపై ఒంటరితనం ఆమెకు ఎన్నో పాఠాలనూ నేర్పింది. దాంతో తనలా కుటుంబ సభ్యుల్ని కోల్పోయిన ఆడపిల్లలకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు షాలిని. ప్రమాదం జరిగే నాటికి తను ఓ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆ సమయంలోనే సామాజిక మాధ్యమాల ద్వారా బ్రాండింగ్ చేయడం, ఆదాయం పొందడం చూశారట. ఇక, వాటిని తాను ప్రజోపయోగం కోసం ఉపయోగించాలనుకున్నారు.

**చదువుల సాయం...**

సోషల్‌మీడియా హడావుడి లేనప్పుడే షాలిని అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో సేవలందించేవారు. వారాంతాల్లో వారితో గడిపి వచ్చేవారు. తండ్రి మరణం తర్వాత అలాంటి వారిపై మరింత సానుభూతి పెరిగిందామెకు అలాంటివారికి చేయూత అందించేందుకు 'ది రాబర్ట్స్ ట్రస్ట్'ని ఏర్పాటు చేశారు. కష్టాల్లో కుటుంబాలు, యువతుల కథలను ఇన్‌స్టావేదికగా పంచుకోవడం మొదులుపెట్టారు. ఈ పోస్టులకు పెద్ద ఎత్తున ఆదరణ లభించడమే కాక వారి జీవితాలు బాగుపడేందుకు అవసరమైన సాయమూ దాతల నుంచి అందుతోంది. సేవ చేయాలంటే డబ్బు కావాలనికుంటారు. చాలమంది. కానీ కాస్త సమయం కేటాయించి.. ఓదార్పునిచ్చినా చాలు. అలా నేను కలిసిన వారిలో ఓ అమ్మాయి తనకి కేవలం పాఠ్య పుస్తకాలు ఇస్తే చాలంది. ఇంకో యువతి నా అనుకునే ఓదార్పు కావాలనుకుంది. ఇవన్నీ పెద్ద సమస్యలేం కాదు. కానీ, వాటిని తీర్చడం ద్వారా వాళ్లల్లో ఆత్మవశ్వాసాన్ని నింపొచ్చు. ఎమోషనల్ హీలింగ్ చేయొచ్చు అని చెబుతారామె. ప్రస్తుతం షాలిని ఆధ్వర్యంలో నడిచే ఈ సంస్థ తమిళనాడులో 100 మంది అమ్మాయిల చదువులకు సాయం చేస్తు న్నారు. మహిళలు, దివ్యాంగులు చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించడంలో చేయూతగా ఉంటున్నారు. అన్నట్లు చెప్పనేలేదు కదూ.. టెడెక్స్ స్పీకర్ కూడా అయిన షాలినీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకి రెండు లక్షల మందికిపైగా ఫాలోవర్లూ ఉన్నారు. □



# ప్రభువు ప్రేమను చాటుదాం..



'అందుకు పేతురును యోహానును వారిని చూచి-దేవుని మాట వినుటకంటె మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పుడి, మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని వారికి ఉత్తరమిచ్చిరి' (అపొస్తలు 4: 19,20). నిజమే దేవుడి ప్రేమను రుచిచూసిన వారు ఎవరైనా ఇతరులకు ఆయన ప్రేమను గురించి చెప్పకుండా ఉండలేరు. కానీ యేసుక్రీస్తు శిష్యులైన పేతురు, యోహానులకు ఉన్న ధైర్యం గొప్పది. వారు యూదుల అధికారులను, రాజ్యాధినేతల్ని కూడా లెక్కచేయకుండా సువార్తను ప్రకటించారు. వీరి సువార్త వల్ల వేలాదిమంది ప్రజలు రక్షించబడ్డారు. యోరుషలేంలో గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రజలు తండోపతండాలుగా ప్రభువు శిష్యులను వెంబడిస్తూ, యేసుక్రీస్తుని సేవించేవారు. దీన్ని ఆ పాలకులు అడ్డుకునేందుకు పేతురు, యోహానులకు యేసుక్రీస్తు గురించి బోధించవద్దని ఆజ్ఞాపించారు. అయినా వారు ప్రభువు చేసిన కార్యాల యాను చెప్పకుండా ఉండలేమని ఖరా ఖండిగా చెప్పారు. చివరికి సువార్త నిమిత్తం హతసాక్షిగా మారారు. నిజమే యేసుక్రీస్తు ప్రేమను మనం అనుభవిస్తే ఇతరులకు చెప్పకుండా ఉండలేం. హింసలకు సైతం వెనుదీయరు. ఇలాంటి ప్రేమ, త్యాగం మనకు ఉందా? ఇప్పటికైనా ఆయన ప్రేమను చాటుదాం.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# చిమ్నీలు వాడుతున్నారా?

చిమ్నీలు వాడుతున్నారా? వంటగదిలో జిడ్డు పేరుకుపోవడమే కాదు.. ఘాటైన వాసనలూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. అలాకాకుండా ఉండటానికి ఈ మధ్య అందరూ చిమ్నీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో వాల్‌మౌంటెడ్, ఇన్‌బిల్ట్, టెలిస్కోపిక్, డక్టెడ్, డక్ట్‌లెస్.. ఇలా ఎన్నో రకాలు దొరుకుతున్నాయి. వేలకు వేలు పోసి కొనడమే కాదు.. దాన్ని ఎలా వాడాలో, శుభ్రం చేయాలో కూడా తెలుసుండాలి. అప్పుడే అది ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా చిమ్నీ ఫిల్టర్స్‌నీ, గ్రీజ్ ట్రాప్‌లనూ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వేణ్నీళ్లు, వంటసోడాతో రుద్ది కడిగితే జిడ్డు త్వరగా వదలడమే కాదు మన్నికగానూ ఉంటుంది. ఇక, డక్టెడ్ చిమ్నీల్లో ఏమైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలి. బయటకి తెరుచుకున్న వాటిల్లో ఏవీ దూరకుండా చూసుకోవాలి. కార్బన్ ఫిల్టర్స్ వాడితే వాటిని నిర్ణీత కాలంలో మార్చాలి. అంతేకాదు, బాగా మరిగిన నీళ్లల్లో కాసనత వినెగర్, వంటసోడా కలిపి అందులో చిమ్నీప్లేట్స్ నానబెట్టాలి. తర్వాత ఓ పాత టూత్ బ్రష్‌తో శుభం చేస్తే సరి. □

# మెరిసే జుట్టు కోసం



నిగనిగలాడే నల్లటి వాలు కురులకు ఇష్టం ఉండదు చెప్పండి. అయితే ఈ రోజుల్లో ఆహారపు అలవాట్లతోప మారుతోన్న జీవనశైలి ప్రభావం కురరఉఐ పడుతోంది. వీటికి తోడు స్టైలింగ్ కోసం ఉపయోగిం ఉత్పత్తులు కేశాలను నిర్జీవంగా మార్చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే సులరం చేసుకునే ఈహెయిర్ప్యాక్కు ప్తఆన చూడండి అంటున్నారు నిపుణులు. కావాల్సినవి: .. కోడిగుడ్డు సొన .. తేనె ఒక చెంచా .. ఆలివ్ ఆయిల్ ఒక చెంచా .. ఆముదం నూనె ఒక చెంచా .. ఆర్గన్ ఆయిల్ ఒక చెంచా

తయారీ : ముందు కోడిగుడ్డు సోన ఒక పాత్రలో వేసుకుని బాగాకలపాలి. తర్వాత తేనె, ఆలివ్ ఆయిల్, ఆముదం నూనె, ఆర్గన్ ఆయిల్ కూడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకి పట్టించి అరగంట పాటు ఆరనివ్వాలి. తర్వాత మంచి షాంపూ, కండిషనర్‌తో జుట్టు శుభ్రపరుచుకుంటే సరి.. నిగనిగలాడే కురులు సొంతమవుతాయి అంటున్నారు నిపుణులు. చేయడం. □

# ఆఫర్లతో జాగ్రత్త



పండగల వేళ ఎక్కడ చూడూ ఆఫర్ల జాతరే! దుకాణాలే కాదు ఆన్‌లైన్ వేదికలూ తగ్గింపు ధరలతో ఆకర్షిం చేస్తాయి. దీంతో ఆఫర్లు సరేసరి. తగ్గింపు ధర అని బోల్తా పడట్లేదు కదా? ... గుండుపిన్నుకీ ఆన్‌లైన్ వేదికలపరనే రోజులివి. 'ఫలానా సంస్థ ప్రారంభించి వందో ఏడా సందర్భంగా... ప్రముఖ నగల సంస్థ ఆఫర్... లక్కీ విన్నర్... చెప్పుకొంటూ వెళ్లాలేకానీ వాట్సాప్, ఈమెయిల్స్‌లో వచ్చే లింకులకు కొదవే ఉండదు. అయినవాళ్లు పంపారనో... ప్రముఖ సంస్థ నుంచి వచ్చింది కదా అనో లింకు తెరిచామో మోసపోయే ఆస్కారమే ఎక్కువ. 'నిజమేనేమో' అని నమ్మేంతలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. కాబట్టి, తెరిచేముందు వచ్చిన తీర్చిదిద్దుతున్నారు. కాబట్టి, తెరిచేముందు వచ్చిన లింకులో 'హెచ్‌టిటిపిఎస్' ఉందో లేదో చూసుకోండి. చేతులను రుద్ది కడిగితే యాంటీసెప్టిక్ పనిచేసి మంటను తగ్గిస్తాయి. □

# అఖండ 2: తాండవం అద్భుతం



అఖండ 2: తాండవం ఖచ్చితంగా అందరినీ అలరిస్తుంది: కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ 2: తాండవం' రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. టీజర్ సాంగ్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. ఈరోజు మేకర్స్ కర్నాటకలో జరిగిన భారీ ఈవెంట్ లో ట్రైలర్ లాంచ్ చేశారు. కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరైన ట్రైలర్ ని లాంచ్ చేశారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఇది శివతత్వంతో ఉన్న అద్భుతమైన సినిమా. శివన్న చేతుల మీదగా ఈ ట్రైలర్ ని లాంచ్ చేయడం మేము చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాం. ఆది పినిశెట్టి మాట్లాడుతూ.. ట్రైలర్ ని లాంచ్ చేసి మమ్మల్ని ఆశీర్వదించిన శివన్న గారికి థాంక్యూ. హీరోయిన్ సంయుక్త మాట్లాడుతూ... అందరికి నమస్కారం. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. బోయపాటి సినిమాలో చేయడం నా అదృష్టం. బాలయ్య గారితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

# 28న థియేటర్‌లోకి జనతాబార్'



నవంబరు 28న థియేటర్‌లోకి రానున్న 'జనతాబార్' ప్రముఖ కథానాయిక రాయ్ లక్ష్మీ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న లేడి ఓరియెంటెడ్ చిత్రం 'జనతాబార్' రోచి మూవీస్ పతాకంపై రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో అశ్వర్థ నారాయణ సమర్పణలో నిర్మాణం జరుపుకుంటోన్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 28న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రమణ మొగిలి మాట్లాడుతూ స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్నమహిళలపై ఆ స్పోర్ట్స్ విభాగంలో ఉన్న ఉన్నతాధికారులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న సెక్సువల్ హరాస్‌మెంట్‌కు చరమగీతం పాడటానికి పోరాడిన ఓ మహిళ కథ ఇది. ఈ చిత్రంలో రాయ్‌లక్ష్మీ పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో పాటు సమాజానికి మంచి సందేశంతో పాటు మహిళల్లో చైతన్యం నింపే సినిమా ఇది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ ఈ చిత్రంలో ఎంతో శక్తివంతమైన పాత్రను పోషించాడు.తప్పకుండా ఈ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. అమన్ ప్రీతిసింగ్, దీక్షపంత్, శక్తికపూర్, అనూప్‌సోని, ప్రదీప్‌రావత్, సురేష్ భూపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రాంబాబు గోసాల, కళ్యాణ్ చక్రవర్తి, శ్రీనివాస్‌తేజ, ఫోటోగ్రఫి: చిట్టిబాబు,సంగీతం: వినోద్ యజమాన్య, రచయిత: రాజేంద్ర భరద్వాజ్.

తెర

# 'మోహన రాగ' మ్యూజిక్ లేబుల్



రాకింగ్ స్టార్ మంచు మనోజ్ తన కొత్త మ్యూజిక్ లేబుల్ "మోహన రాగ" ప్రారంభిం చారు. లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్ అనే క్యాప్షన్ తో మన సంగీతాన్ని వరల్డ్ వైడ్ రీచ్ చేసేందుకు మోహన రాగ మ్యూజిక్ లేబుల్ తో తనదైన ప్రయత్నం చేయబోతున్నారు మంచు మనోజ్. ఈ రోజు సోషల్ మీడియా ద్వారా మంచు మనోజ్ ఈ ప్రకటన చేశారు. సంగీతం మీద తనకున్న ప్రేమే మోహన రాగ మ్యూజిక్ లేబుల్ స్థాపించేలా స్ఫూర్తినిచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఫ్రెష్ సౌండ్స్, బోల్డ్ టాలెంట్, ఫియర్ లెస్ క్రియేటివిటీ తమ మ్యూజిక్ లేబుల్ ద్వారా సంగీత ప్రపంచానికి పరిచయం చేస్తామని మంచు మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ ను అభినందిస్తూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు, నెటిజన్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# 'పాంచ్ మినార్' మిస్ అవ్వొద్దు



'పాంచ్ మినార్' చూసిన ఆడియన్స్ అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమాని థియేటర్స్‌లో మిస్ అవ్వొద్దు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ కలసి ఎంజాయ్ చేసే సినిమా ఇది: సక్సెస్ మీట్‌లో హీరో రాజ్ తరుణ్‌యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరో ఫన్ టాస్టిక్ బ్లాక్ బస్టర్ 'పాంచ్ మినార్' రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్‌లో రాశి సింగ్ హీరోయిన్ గా నటించింది. గోవింద రాజు ప్రజెంట్ చేసిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ లిలిశి బ్యానర్ పై మాధవి, MSM రెడ్డి నిర్మించారు. నవంబర్ 21న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.సక్సెస్ మీట్ లో హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. ఈ సినిమాకి మీడియా వారు ఇస్తున్న సపోర్ట్‌కి థాంక్యూ. శ్రీనివాస్ రెడ్డి గారికి నేను ఫ్యాన్ బాయ్. ఆయనతో కలిసి పనిచేసిన అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన వెంకీ సినిమాకి ఇప్పటికీ ఒకేలా ఉన్నారు.

# లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'ప్రేమంటే'



'ప్రేమంటే' కి సూపర్ హిట్ రెస్పాన్స్ ఇచ్చిన ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. ఈ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ ని మీరందరూ తప్పకుండా థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను: ప్రెస్ మీట్‌లో హీరో ప్రియదర్శి ప్రియదర్శి లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ప్రేమంటే. ఆనంది హీరోయిన్ గా నటించింది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేశారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మించిన చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేసింది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ గారికి ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. నవంబర్ 21న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్ లో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇంత మంచి సూపర్ హిట్ సినిమా ఇచ్చినందుకు ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్ మాట్లాడుతూ.. సినిమాకి ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ అదిరిపోయింది. ప్రతి చోట ఎంజాయ్ చేస్తున్నారు. ఆనంది మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. సినిమా థియేటర్లో అద్భుతమైన పాజిటివ్ వైబ్ ఉంది. సినిమా అయిన తర్వాత అందరూ క్లాప్స్ కొట్టారు. అందరూ కూడా చిరునవ్వుతో బయటకు వస్తున్నారు.ప్రొడ్యూసర్ జాన్వి నారంగ్ మాట్లాడుతూ. అందరికి నమస్కారం. ప్రేక్షకులం దరూ కూడా సినిమాని చాలా ఎంజాయ్ చేస్తూ నవ్వుకుంటూ వెళ్లారు. ఎంతో ప్రేమని ఇచ్చారు. అందరూ కూడా సూపర్ మూవీ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అని కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు.

# 'త్రీ రోజెస్' సీజన్ 2 టీజర్ రిలీజ్



"త్రీ రోజెస్" సీజన్ 1 ను మించిన ఎంటర్ టైన్ మెంట్ "త్రీ రోజెస్" సీజన్ 2లో చూస్తారు టీజర్ లాంఛ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్..ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ "త్రీ రోజెస్". ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్ గా వ్యవహరిస్తు న్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో "త్రీ రోజెస్" సీజన్ 2 టీజర్ రిలీజ్ చేశారు. ఆహా కమర్షియల్ హెడ్ రాజేశ్ వాసిరెడ్డి మాట్లాడుతూ "త్రీ రోజెస్" ఫస్ట్ సీజన్ ఎన్నో రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సీజన్ సక్సెస్ అయినప్పటి నుంచి సెకండ్ సీజన్ పై డిమాండ్ ఏర్పడింది. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ "త్రీ రోజెస్" కాన్సెప్ట్ తో ఎన్ని సిరీస్ లు అయినా చేయొచ్చు. అలాంటి యూనిక్ కాన్సెప్ట్ మారుతి గారు ఇచ్చారు. ఆయన రాజా సాబ్ సాంగ్ రిలీజ్ పనుల్లో ఉండి రాలేకపోయారు.

### మహిళల కబడ్డీ వరల్డ్ కప్..
# సెమీ ఫైనల్స్‌కు భారత్
### బంగ్లాదేశ్‌పై 16-51తో గెలుపు



**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్ సెమీఫైనల్లోకి ప్రవేశించడానికి భారత్ 4/4 విజయాలతో లీగ్ దశను పూర్తి చేసింది. మహిళల కబడ్డీ ప్రపంచ కప్‌లో భారత్ తమ చివరి గ్రూప్ ఎ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 51-16 తేడాతో ఓడించి లీగ్‌దశ రికార్డుతో సెమీఫైనల్‌కు చేరుకుంది. తద్వారా వారి అజేయ విజయాన్ని నాలుగుకు పెంచుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్స్ భారత్ అన్ని మ్యాచ్‌లలో పూర్తి నియంత్రణను కొనసాగించింది. దీంతో ఈ నెల 23న ఢాకాలోని షహీద్ సుహ్రావర్డీ ఇండోర్ స్టేడియంలో తమ సెమీఫైనల్ ఆడతారు. జర్మనీపై 63-22 తేడాతో విజయం సాధించిన తర్వాత భారత్ ఇప్పటికే అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో థాయిలాండ్ (65-20), ఉగాండా (72-15)పై మునుపటి విజయాలు సహా ఆధిపత్యాన్ని సంపాదించింది. ఆతిథ్య బంగ్లాదేశ్‌పై భారత్ తాజా విజయం టోర్నమెంట్‌లో అత్యంత స్థిరమైన, క్లినికల్ జట్టుగా స్థానాన్ని బలోపేతం చేసింది. ఈ ఫలితంతో, భారత్ 12 పాయింట్లు మరియు పోటీలో అత్యధిక పాయింట్ల తేడాతో గ్రూప్ దశను ముగించింది. బంగ్లాదేశ్, థాయిలాండ్, ఉగాండా, జర్మనీలను అధిగమించి పూల్ ఎ లో అగ్రస్థానంలో నిలిచారు. ఇదే జోరుతో 2012లో తొలిసారి గెలిచిన కిరీటాన్ని తిరిగి కాపాడుకోవడానికి ఒక అడుగు దగ్గరగా వెళ్లాలనే లక్ష్యంతో భారత్ జట్టు ఇప్పుడు నాకౌట్ దశకు సిద్ధమవుతోంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు లక్ష్య



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 బ్యాడ్మింటన్ టోర్నీలో చౌ టియన్ చెన్‌ను ఓడించి లక్ష్య సేన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. సిడ్నీలో శనివారం జరిగిన ఈ ఓపెన్ సూపర్ 500 పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో భారత షట్లర్ లక్ష్య, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్‌పై మూడు గేమ్‌ల విజయంతో దూసుకెళ్లాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన లక్ష్య ప్రారంభ ఆటలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని అద్భుత ప్రదర్శనతో 86 నిమిషాల సెమీఫైనల్లో రెండవ సీడ్‌ను 17-21, 24-22, 21-16 తేడాతో ఓడించాడు. ఈ ఏడాది ప్రారంభంలో హాంకాంగ్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్న 24 ఏళ్ల ఈ యువకుడు ఈ సీజన్‌లో ఇంకా టైటిల్ గెలవలేదు. ఈ నెల 23న జరిగే సమ్మిట్ పోరులో జపాన్‌కు చెందిన యుషి తనకా లేదా చైనీస్ తైపీకి చెందిన ఐదవ సీడ్ లిన్ చున్‌యితో తలపడనున్నాడు. లక్ష్య స్థిరమైన ఆట ఆట మధ్యలో విరామంలో అతనికి 11-6 ఆధిక్యాన్ని సంపాదించిపెట్టింది. తదుపరి 19-15 వద్ద ఇద్దరూ 44షాట్ల ర్యాలీని ఆడారు. లక్ష్య తన డిఫెన్సివ్ గ్రిట్‌ను అసాధారణమైన సేవ్‌లతో ప్రదర్శించి పాయింట్‌ను స్మాష్‌తో ముగించాడు. చెన్ చేసిన సర్వీస్ లోపం లక్ష్యను 17-9కి చేర్చడంతో పాటు, ఎనిమిది మ్యాచ్ పాయింట్లను సంపాదించిపెట్టింది. చెన్ నాలుగు సేవ్ చేసాడు కానీ చివరికి షటిల్‌ను గోల్ గా మార్చాడు, లక్ష్య అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాడు.



### ఇండియన్ ఓపెన్ టైటిల్..
# ఫైనల్స్‌లో అనహాత్, జోష్నా ఢీ

**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ 2025, ఆల్ ఇండియా ఫైనల్స్‌లో భారత్ స్క్వాష్ దిగ్గజాలు జోష్నా చినప్పతో అనాహత్ సింగ్ తలపడనున్నారు. అనహత్, జోష్నా ఫైనల్‌కు చేరుకోవడంతో ఇండియన్ ఓపెన్-2025లో మహిళల టైటిల్‌ను భారత్ ఖాయం చేసుకుంది. పిఎస్ఎ కాంస్య ఈవెంట్ ఇప్పుడు దేశంలోని వర్ధమాన స్టార్, అత్యంత అనుభవజ్ఞురాల మధ్య పోరో జరగనుంది. టోర్నమెంట్‌లో టాప్ సీడ్ అనహత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. జర్మనీకి చెందిన కాటెరినా టైకోవాపై క్వార్టర్ ఫైనల్ విజయాన్ని సాధించి సెమీఫైనల్స్‌లో మరో అద్భుతమైన ప్రదర్శనతో టైటిల్ రౌండ్‌కు చేరుకుంది. 16 ఏళ్ల ఈ అమ్మాయి ఈ వారమంతా అద్భుతమైన ఫామ్‌లో ఉంది, ప్రత్యర్థులను అధిగమించడానికి, ఆమె మ్యాచ్‌లలో కనీస పాయింట్లను కోల్పోవడానికి తన వేగం మరియు ఖచ్చితత్వాన్ని ఉపయోగించింది. డ్రాకు వ్యతిరేక దిశలో, అనుభవజ్ఞురాలు జోష్నా చిన్నప్ప ఫైనల్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకోవడానికి మరో క్లినికల్ ప్రదర్శన ఇచ్చింది. మాజీ ప్రపంచ టాప్10 క్రీడాకారిణి, గతంలో క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్‌కు చెందిన సోఫియా మాటియోస్‌ను ఓడించింది. ఆమె కెరీర్‌లో చివరిలో మరొక పిఎస్ఎ టైటిల్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నందున సెమీఫైనల్ విజయం పట్టుదల, స్థిరత్వంతో సాధించింది. ఇక పురుషుల ఈవెంట్‌లో, భారత్‌కు చెందిన రమిత్ టాండన్ క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ యూసఫ్ సోలిమాన్‌ను ఐదు గేమ్‌లకు ఓడించి సెమీఫైనల్ బెర్తును తృటిలో కోల్పోయాడు. చివరికి సోలిమాన్ 11-5, 9-11, 3-11, 11-3, 11-5 తేడాతో విజయం సాధించి తన టైటిల్ బిడ్‌ను సజీవంగా ఉంచుకున్నాడు. మహిళల ఫైనల్ ఇప్పుడు అఖిల భారత పోటీగా నిర్ధారించబడినందున, ఇండోర్‌లో అందరి దృష్టి ఈ నెల 23న జరిగే పోరుపైకి మళ్లింది.

# సౌతాఫ్రికా వన్డేకు రోహిత్, కోహ్లీ రీ ఎంట్రీ
### శుభ్‌మన్, పాండ్యా ఔట్.. శ్రేయస్ డౌట్



**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 26న గౌహతిలో రెండో టెస్ట్ ముగియనుండగా, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే అంటే ఈ నెల 30న రాంచీ వేదికగా తొలి వన్డే జరగనుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ త్వరలోనే భారత జట్టును ప్రకటించనుంది. ఈ సిరీస్ ద్వారా టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి వన్డే జట్టులోకి అడుగుపెట్టనున్నారు. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. గాయం నుంచి కోలుకున్నప్పటికీ, నేరుగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకుండా, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరపున ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోనున్నాడు. అలాగే ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే మరొకరికి కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించేందుకు సిద్దమైంది. ఈ అవకాశం మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అప్పగించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఇక వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయంతో దూరమవడంతో రుతురాజ్ గైక్వాడ్‌కు జట్టులో చోటు దక్కవచ్చు. మరోపక్క రాబోయే టీ20 సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ వన్డేల నుంచి విశ్రాంతినివ్వనున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియాలో పేసర్లుగా సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ రేసులో ఉండగా, స్పిన్నర్లుగా కుల్దీప్, వరుణ్ చక్రవర్తి కొనసాగే అవకాశం ఉంది. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్, బ్యాకప్‌గా రిషభ్ పంత్ ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

అంచనా జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రిషభ్ పంత్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి ఉన్నారు.

# రెండో టెస్టు తొలి రోజు భారత్‌పై ఆధిక్యంలో దక్షిణాఫ్రికా



**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆటలో దక్షిణాఫ్రికా పై చేయి సాధించింది. మొదటి రోజు ఆటముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు నష్టానికి 247 పరుగులు చేసింఇ. ప్రస్తుతం క్రీజులో ముత్తుస్వావి (25), వెర్రిన్ (1) ఉన్నారు. శనివారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రొటీస్ జట్టుకు ఓపెనర్లు మార్క్రమ్ (38), రికెల్టన్ (35) శుభారంభాన్ని అందించారు. బ్యాటర్లకు అనుకూలంగా ఉండే విధంగా పిచ్ తయారు చేయడంతో తొలి వికెట్‌ను సాధించేందుకు టీమిండియా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. జస్ప్రిత్ బుమ్రా అద్భుతమైన బంతితో మార్క్రమ్‌ను ఔట్ చేయడంతో భారత్‌కు తొలి వికెట్ లభించింది. అనంతరం ట్రిస్టన్ స్టబ్స్ (49), కెప్టెన్ టెంబా బవుమా (41) నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే రెండో సెషన్‌లో మాత్రం భారత్ బౌలర్లు పుంజుకున్నారు. ముఖ్యంగా స్పిన్నర్లు కీలక వికెట్లు పడగొట్టారు. రికెల్టన్, స్టబ్స్, ముల్డర్‌లను కుల్దీప్ యాదవ్ పెవిలియన్‌కు పంపగా, బవుమాను జడ్డూ బోలాత కొట్టించాడు. భారత్ బౌలర్లలో ఇప్పటి వరకూ కుల్దీప్ మూడు వికెట్లు పడగొట్టగా, బుమ్రా, సిరాజ్, జడేజా తలో వికెట్ దక్కించుకున్నారు.



### యాషెస్ సిరీస్:
# ఆస్ట్రేలియా చేతిలో ఇంగ్లండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ 2025-26ను ఆస్ట్రేలియా ఘనంగా ఆరంభించింది. పెర్త్ వేదికగా శనివారం జరిగిన తొలి టెస్టులో 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఆసిస్ చిత్తు చేసింది. 205 పరుగుల లక్ష్యాన్ని కంగారులు కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేధించారు. లక్ష్య ఛేదనలో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసిన ఆసిస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ కేవలం 69 బంతుల్లో తన సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 83 బంతులు ఎదుర్కొన్న హెడ్ 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123 పరుగులు చేశాడు. అతడితో పాటు మార్నస్ లబుషేన్ (51) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కాగా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఇంగ్లండ్ బ్యాటర్లు తీవ్ర నిరాశపరిచారు. ఆసిస్ స్పీడ్ స్టార్ మిచెల్ స్టార్క్ (7) వికెట్లు ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలిన స్టోక్స్ సేన, రెండో ఇన్నింగ్స్‌లో కూడా అదే తీరును కనబరిచింది. బోలాండ్, స్టార్క్, డాకెట్‌లు నిప్పులు చెలరేగడంతో ఇంగ్లండ్ 164 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యాన్ని జోడించి ఆసిస్ ముందు 205 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ ఉంచింది. అయితే తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో విఫలమైన ఆసిస్ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చి ఘన విజయాన్ని అందుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసిస్ కేవలం 132 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగులు చేసి ఇంగ్లండ్‌ను ఓడించింది.




VIJAYAWADA: ANDHRA PRABHA COLONY: MITHRA AUTO AGENCY: 7337540033. 8886063544 | VARUN MOTORS: RING ROAD: 9885701729 ENIKEPADU: 9885104222, 9885706831 | KANURU: SANTOSH AUTO: 7799787967 | ELURU: REDDY & REDDY MOTORS: 9533290285 | BHIMAVARAM: NOVELTY REDDY & REDDY MOTORS: 9948424555 | GUNTUR: JAYALAKSHMI AUTOMOTIVES: 7396669031 | VARUN MOTORS: 8977752604 | NELLORE: VISHNU CARS: 7995088876 | BHARGAVI AUTOMOBILES: 9848357778 | ONGOLE: JAYALAKSHMI AUTOMOTIVES: 9949033433.

*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మకమైన నియమాలు మరియు షరతుల కోసం దయచేసి మీకు దగ్గరలో ఉన్న డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర మరియు ట్రూ వేల్యూచే ధృవీకరించబడిన కార్లపై వారంటీ వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ అనేది లేబర్ ఛార్జీల పై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు కేవలం ఉదాహరణ లక్ష్యం కోసం మాత్రమే ఇవ్వబడ్డాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.